గోలకొండ పత్రిక చందా రేట్లు

సంవత్సరానికి	రు.	27-00
అర్ధ సంవత్సరానికి	,,	14-00
3 నెలలకు	,,	7-00
విడికాపీ	7	నయాపైసలు
ఆదివారం సంచిక	10	,,

మూడు నెలలకు తక్కువ చందా తీసుకోబడదు.

స్థాపితము 1926 రిజిష్టర్ నెం 92

గోలకొండ పత్రిక

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి.ఎం.ఏ

ఇల్లు వేలం

యాకుత్‌పుర స్టేషన్ సమీపమున పోస్టాఫీసు దెదుట సురయ్యా యార్ ఖాన్ దేవిడి ప్రక్కన పెద్ద ఇల్లు మరియు 5 మర్లీలు (17-2-1214 నుండి 1219) గలిగి నెలకు రు. 60/-లు కిరాయవచ్చు దానిని 13-10-63 ఆదివారం ఉ॥ 10-0 గం॥ వేలం వేయబడును.

గఫూర్ అండ్ సన్స్
ఛత్తాబజార్, హైద్రాబాద్

102248

సంపుటి 16 సంచిక 267 * హైద్రాబాదు 12—10—1963 శనివారం * 4 పేజీలు 7 నయాపైసలు

సమితిలో దక్షిణాఫ్రికా నిరసన తీర్మానం విజయం

గోవా పై సైనికచర్య గైకొనబడినప్పుడు భారత నౌకాదళానికి సంబంధించిన సామ్యూల్ జయశీలన్ మోహన్‌దాస్ [హైదరాబాద్] చనిపోయారు. ఆ వీరుని మాతృశ్రీ శ్రీమతి జి. వివేకానందకు రాష్ట్రపతి ఈ నెల 8వ తేదీన అశోక్ చక్ర బహూకృతిని అందజేసినప్పటి చిత్రం.

భిక్షుకవాడ ఏర్పాటు, నెలకు రు. 30 భృతి

కార్పొరేషన్ స్థాయిసంఘాధ్యక్షుని కలసి భిక్షుక ప్రతినిధివర్గం డిమాండ్లు

హైదరాబాద్, అక్టో 11

అంధ భిక్షుకులు వికలాంగ భిక్షుకులు వందలాదిగా ఈవేళ హైదరాబాద్ కార్పొరేషన్ ఆవరణలో గుమిగూడి వారిని వేరుచేసి దూరం చేయాలను కోడంకన్న భిక్షుకుల కాలనీ యేర్పాటు చేయించాలని నినాదాలు చేశారు.

లాలాపేటలోని కుష్ఠవ్యాధి పీడితుల ఆశ్రయములుండి కొందరు కుష్ఠువారు కూడా ఈవేళ ఊరేగింపుగా బయలుదేరి వచ్చి కార్పొరేషన్ అధికారులకు తమ ఆశ్రయాన్ని నడుపుతున్న అధికారులపై కొన్ని ఫిర్యాదులు తెలియజేశారు.

భిక్షుకుల ప్రతినిధివర్గము ఒకటి ఈవేళ కార్పొరేషన్ స్థాయిసంఘాధ్యక్షుని కలిసి తమ డిమాండ్లను తెలియజెప్పింది. భిక్షుకుల్ని నగరములో కనిపించకుండాచేసి వారికోసము విడిగా ఏవో ఆశ్రయాలు నిర్మించి వేరు పరిచేకన్నా భిక్షుకులకోసము ఒక కాలనీ నిర్మించి ఇవ్వాల్సిందనీ ఒక్కొక్క కుటుంబానికి ఒక్క గది ఉండేట్లు కాలనీ ఇళ్ళు తయారు చేయించాలనీ ఒక్కొక్క భిక్షుక కుటుంబానికి 30 రూపాయలు నెలకు అలవెన్సు ఇవ్వాలనీ ఈభిక్షుక కాలనీలో చిన్న మార్కెటు, రేషను దుకాణము, పాఠశాల ఏర్పాటు చేయించాలనీ భిక్షుక ప్రతినిధివర్గము కోరింది.

అబ్దుల్ రజాకు అను అంధుడు తమకు పాఠశాలలకు వెళ్ళేవయస్సున్న పిల్లలున్నారనీ తమను తీసుకుపోయి ఏ ఆశ్రయములోనో నిలుపుతే ఆపిల్లల భవిష్యత్తు పాడవుతుందనీ తామే ఆ కుటుంబానికి ఉపాధినిచ్చే వ్యక్తులమనీ తెలిపాడు. మరో అంధుడు చంద్రయ్య అను నాతడు పోలీసు జులుం నుగురించి ఫిర్యాదు చేశాడు.

మున్సిపల్ కార్పొరేషన్ భవనము ఎదురుగా అయ్యయ్య అను అంధుడు సాగిస్తున్న నిరశన దీక్ష ఈవేళ ఆరవ రోజులో పడింది. భిక్షుక వృత్తి నిర్మూలన చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరశన దీక్షనాతడు కొనసాగిస్తున్నాడు.

మాస్కోలో డా॥ నయ్యర్

మాస్కో, అక్టో 11

భారతారోగ్య మంత్రి శ్రీ డా॥ సుశీలానయ్యర్ అధికార పర్యటనపై నేడు మాస్కో చేరారు. రష్యా ఆరోగ్యమంత్రి కురషోవ్, అధికారులు, రష్యా రెడ్‌క్రాస్ సంఘంవారు ఆమెకు స్వాగత మిచ్చారు.

భారత దౌత్య కార్యాలయాధికారులు, అనధికార భారతీయులు కూడా విమానాశ్రయానికి వచ్చారు.

బ్లాకు స్థాయిలో కూడా కామరాజ్ పథకం

వరదన్నపేట, అక్టో 11

వరదన్నపేట బ్లాకు పంచాయితీలఉద్యోగుల యూనియన్ అధ్యక్షులును, వరదన్నపేట గ్రామ పంచాయితీ కార్యనిర్వహణాధికారి యగు శ్రీ కె. రాజయ్య కామరాజ్ పథకమును పురస్కరించుకొని తమ పదవికి రాజీనామాను జిల్లా కలెక్టరుకు అందజేసినారు. వారు తమ రాజీనామా పత్రములో ఇకముందు తమ సేవను దేశ సౌభాగ్యమునకు ప్రజా రంగములో వినియోగించగలనని పేర్కొనినారు. వీరు నిజాం ఆంధ్రమహాసభ నాటి కార్యకర్తలు. వరంగల్ జిల్లాలోని స్టేట్ కాంగ్రెస్ అతివాదులలో నొకరు. నిర్మాణాత్మక కార్యకర్త. రాజీనామా పత్రము ప్రతి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుల వారికి పంపినారు.

జపాన్‌నుండి ఋణానికై ఒప్పందం చర్చలు

వచ్చేవారంలో విజయవంతం

కాగల సూచన

టోకియో, అక్టో 11

మూడో ఋణ ఒప్పందం నిమిత్తం జపాన్ - భారతదేశాల ప్రతినిధివర్గాల మధ్య సాగుతున్న సంప్రదింపులు ఉభయ కార్య సంతృప్తికరంగా వచ్చే వారములో పరిష్కారానికి రావచ్చునని భావించబడుతున్నది.

గత పది దినాలుగా ఈ సంప్రదింపులు సాగుతున్నాయి. ఋణం వస్తుసామగ్రి కొనుగోలు కోసము ఇవ్వాలా లేక భారీప్రాజెక్టుల నిమిత్తం ఇవ్వాలా అనేది ఇంకా తేల్చబడలేదట.

65 మిలియన్ డాలర్ల ఋణం కోసం ఈ సంప్రదింపులు సాగుతున్నాయి. ఈ ఋణాన్ని ప్రాజెక్టులకు వినియోగించాలని జపాన్ కోరుతున్నది. భారతదేశం మాత్రం సగం మొత్తమయినా ట్రాక్టర్లు టాక్సీ ఫార్మట్లు మున్నగునవి కొనేందుకు వినియోగించ నివ్వాలని కోరుతున్నది.

కాశ్మీర్ పై పాకిస్థాన్ క్లెయిం నిరాకరణ

భారతదేశ వైఖరికే ఆఫ్గనిస్తాన్ మద్దతు నిస్తున్నట్లు ప్రొ॥ కబీర్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టో 11

చైనాతోగల 30 మైళ్ళ పొడవు సరిహద్దులకు సంబంధించిన వ్యవహారంలో కాశ్మీరు భూభాగంపై పాకిస్తాన్ క్లెయిమును ఆఫ్‌గనిస్తాన్ గుర్తించ నిరాకరించినట్లు నేడు విలేఖరులగోష్ఠిలో ప్రొ॥ హుమాయూన్ కబీరు తెలిపారు.

ఇటీవల కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ప్రొ॥ కబీరు ఆఫ్‌గనిస్తాన్ పర్యటనకు వెళ్ళి వచ్చారు.

ఆఫ్‌గనిస్తాన్‌తో సరిహద్దుల స్థిరీకరణకు సంబంధించిన చర్చలకయి కాబూల్ వెళ్ళిన చైనా ప్రతినిధివర్గం తమ చర్చల సందర్భముగా కాశ్మీరు భూభాగం రక్షణబాధ్యత పాకిస్తానుదేనన్న ప్రస్తావన తేగా ఆఫ్‌గనిస్తాన్ నిరాకరించిందని ప్రొ॥ కబీరు అన్నారు. దీనివల్ల కాశ్మీరుసమస్య విషయములో ఆఫ్‌గనిస్తాన్, భారతదేశ విధానాన్ని బలపరుస్తున్నట్లు తేలుతున్నదని ప్రొ॥ కబీరు అన్నారు.

పాకిస్తాన్ - ఆఫ్‌గనిస్తాన్ దేశాల మధ్య సంబంధాలు అంతసరిగా లేవనీ ఫక్తూనిస్తాన్ సమస్య ఇంకా ముగియలేదనీ కృత్రిమమైన విభజన ద్వారా ఆ ప్రాంతానికి ఘోరమైన అన్యాయం జరుగుతున్నట్లు ఆఫ్గనిస్తాన్ భావిస్తున్నదనీ ప్రొ॥ కబీర్ వెల్లడించారు.

డ్యూరాండ్ రేఖ విషయమై భారతదేశంలో సరైన అవగాహన లేనట్లు ఆఫ్‌గనిస్తాన్ భావిస్తున్నదట. అసలు అంతర్జాతీయ సరిహద్దు డ్యూరాండ్ రేఖ కాదనీ దానికి ఇంకా తూర్పుగా ఉన్న రేఖయే అసలు సరిహద్దు అనీ కాగా డ్యూరాండ్ రేఖను సరిహద్దుగా పాకిస్తాన్ సూచిస్తున్నదంటే అంతవరకూ అది పాకిస్తాన్ దురాక్రమణగానే ఆఫ్‌గనిస్తాన్ భావిస్తున్నదనీ ప్రొ॥ కబీరు అన్నారు.

పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడితే ఇండియాతోను ఆఫ్‌గనిస్తాన్‌తోను పాకిస్తాన్ సంబంధాలు బాగుపడతాయని ఆఫ్‌గనిస్తాన్ నాయకులు భావిస్తున్నట్లు ప్రొ॥ కబీరు తన పర్యటనానుభవాలను వెల్లడిస్తూ నేడు వివరించారు.

1656 సంవత్సరంలో రామదాసుకు తానాషా ఇచ్చిన ఫర్మానా

హైదరాబాద్, అక్టో 11

శ్రీ పుచ్చా వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రి ఇలా వ్రాస్తున్నారు:

కంచర్ల గోపన్న అను భద్రాచల రామదాసును తహసీల్‌దారుగా నియమిస్తూ గోలకొండ నవాబు తానాషా వ్రాసి ఇచ్చిన ఫర్మానాకు నకలు ఇది:

ఫర్మాన్ వాజబుల్ అజాన్ షాహే అబుల్ హస్‌కా నేషాహ్ మద్దెబుల్లహు అజ్ మొకాం గోల్ కొండ ఖిలా మంయాకే కంచర్ల గోపన్న వల్లు లింగన్న సక్నే నేల్ కొండపల్లీ పర్గణే ఖంమ్మం మెట్‌బర్ ఖిద్మతీ అస్సర్ పర్గనే భద్రాచలం బముషాహిరా మాహ్ బమాహ్ దోసద్ సిక్కే జారియా తఖరుర్ మీ గర్దంద్ గోపన్న మజ్‌కుర్ రాలాజిం అస్తుకే రియా యా బరాయా రా ఖుషోఖుర్రమ్ ఎహ్తామాం దారంద్ వఇన్ సరాం వ ఎహ్తేరాం ఉమూరే ముమ్ లేకతీ బిలాఉజరో హీలా అలా అదామదనీవ అదామదల్ వజేహీఖాహి సల్తనత్ బాషద్ మర్కుంగురర్ జమాదిలవల్ దస్‌సౌ పచ్‌హత్తర్ హిజ్రీ".

ఈ ఫర్మానాతో హిజిరీ 1075జమాదిలవల్ మాసమని యున్నది. ఈ సువత్సరము హిజిరీ 1082-83 అగుచున్నది. దీనినిబట్టి నేటికి 307సంవత్సరముల క్రిందట క్రీ.శ. 1656సంవత్సరమున భద్రాచల రామదాసుకు తహసీల్‌దారు ఉద్యోగం లభించినట్లు తెలియుచున్నది. ఇట్టి చారిత్రకఫర్మానాలు హైద్రాబాదునందు అనేకములు కలవు. ప్రభుత్వంవారు వీనిని ఉద్ధరించి ప్రకటించిన చరిత్రకు చాలా ఉపకరించగలవు.

నాసరు ఇరాక్ పర్యటన రద్దు

కైరో, అక్టోబరు 11

ఈనెలలో జరుగవలసి ఉన్న ఇరాకు పర్యటన కార్యక్రమాన్ని యు.ఏ.ఆర్. అధ్యక్షుడు నాసర్ రద్దు చేసుకున్నట్లు అల్ అహ్రాం పత్రిక వ్రాసింది.

సెప్టెంబరు 17న ఇరాకు బాతిస్టు పార్టీ ఈజిప్టుపై తీవ్ర వ్యతిరేకతను వెల్లడిస్తూ ప్రకటన చేయడమువల్ల ఈ పర్యటనను నాసరు రద్దు చేసుకున్నాడట.

సిరియాలో గుడ్డిగా తనను నమ్మేవాళ్ళకే నాసరు అధికారము కట్టబెట్టి పరిపాలనాస్థాయినిఅస్తవ్యస్తముచేస్తున్నాడని ఇరాకు బాతిస్టుపార్టీ ఆరోపించింది.

భద్రతామండలి అధ్యక్షునికి జఫ్రుల్లాఖాన్ లేఖ

న్యూయార్కు, అక్టో 11

వివాదగ్రస్తమైన జమ్ము-కాశ్మీరు రాష్ట్రాన్ని భారతదేశంలో పూర్తిగా విలీనీకరించుకోడానికి జరుగుతున్న చర్యల ప్రాముఖ్యాన్ని గురించి ఐక్యరాజ్యసమితిలోని పాకిస్తాన్ శాశ్వత ప్రతినిధి సర్ జఫరుల్లాఖాన్ భద్రతా మండలి అధనిశునికి ఒకలేఖ వ్రాశాడు.

రాజకీయ సంఘ ప్రతిపాదనకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులఓట్లు

ప్రపంచ చరిత్రలో దక్షిణాఫ్రికాకు పోల్చదగినది నాజీజర్మనీతప్ప మరోటిలేదని శ్రీ చక్రవర్తి

న్యూయార్కు, అక్టోబరు 11

వర్ణవివక్షణ విధానాన్ని వ్యతిరేకిస్తున్నందున అటువంటి వారిని అణచివేసేందుకు నిర్బంధించిన వారి నందరినీ బేషరతుగా విడుదలచేసి ప్రిటోరియాలో సాగిస్తున్న విచారణను ఆపుచేయాల్సిందిగా దక్షిణాఫ్రికాను కోరుతూ ఐక్యరాజ్య సమితి ఈవేళ తీర్మానాన్ని ఆమోదించింది.

దక్షిణాఫ్రికాలో బుధవారంనాడు ప్రారంభమైన భారతీయుల విచారణను ఆపివేసి రాజకీయ ఖైదీలందరనూ విడుదల చేయాలన్న జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని బలపరచడానికి అఖరు క్షణంలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు అంగీకారాన్ని ప్రకటించాయి.

ఈ నిర్ణయాన్ని మొదట అమెరికా ప్రతినిధి ఫ్రాన్సిస్ ప్లింప్టన్ ప్రకటించగా సభ్యులంతా హర్షధ్వానాలు కావించారు. తర్వాత బ్రిటిష్ విదేశాంగ వ్యవహారాల సహాయ మంత్రి పీటర్ థామస్ కూడా ప్రకటన చేశాడు. ఈ మూడు రాజ్యాలు నిన్న కమిటీ స్థాయిలో చర్చ జరిగినప్పుడు వర్ణవివక్షణ వ్యవహారముపై దక్షిణాఫ్రికాను మందలించే తీర్మానాన్ని బలపరచడానికి సమ్మతి చూపించి ఉండలేదు.

నెదర్లాండ్స్, బెల్జియం, పనామాల ప్రతినిధులు కూడా నిన్న చర్చలకు హాజరు కాలేదు. నేడు వీరు కూడా తీర్మానానికి అనుకూలముగా ఓటు చేయడానికి నిర్ణయం ప్రకటించారు.

ప్లింప్టన్ (అమెరికా) కోర్కెపై జనరల్ అసెంబ్లీ సమావేశం 20 నిమిషాల పాటు వాయిదాపడిన సందర్భముగా సంప్రదింపులు జరిగి తమ తమ ప్రభుత్వాల ఆమోదం పొంది అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల ప్రతినిధులు తీర్మానానికి అనుకూలముగా ఓటుచేయడానికి ప్రకటించారు.

శ్రీ చక్రవర్తి ప్రసంగం

భారత ప్రతినిధి శ్రీ బి. ఎన్. చక్రవర్తి సమితి సమావేశములో దక్షిణాఫ్రికా వర్ణవివక్షణ విధానాన్ని దుయ్యబట్టుతూ చరిత్రలో దక్షిణాఫ్రికాకు దీటువచ్చేది నాజీకాలపు జర్మనీ తప్ప మరేదీ లేదన్నారు. హిట్లరుఅనుసరించిన జాతివిద్వేష విధానాన్ని నిరోధించడానికి ప్రపంచ యుద్ధమే జరిగి వేలాది ప్రజలు చనిపోవలసి వచ్చిందని శ్రీ చక్రవర్తి ప్రస్తావించారు.

అధికారాలు లేక పోయినప్పటికీ అమానుష చట్టాలాధారంగా జరుగుతున్న విచారణలను నిరోధించాల్సిన బాధ్యత ఏర్పడుతున్నదనీ ప్రిటోరియా విచారణలో దోషులుగా నిలువబడిన వారంతా కేవలం స్వాతంత్ర్యానికైన పోరాడడమే చేసిన పాపమనీ శ్రీ చక్రవర్తి పేర్కొన్నారు.

గినీ ప్రతినిధి డియాలో బెల్లి ప్రసంగిస్తూ విధ్వంసకృత్యాల నిరోధకచట్టాల పేరుతో ప్రిటోరియాలో 11మంది పై దక్షిణాఫ్రికా ప్రభుత్వము నడుపుతున్న విచారణలు కేవలము హత్యకు మారుపేరు మాత్రమేనన్నాడు. దక్షిణాఫ్రికా జైళ్ళలో 5వేల మంది రాజకీయ ఖైదీలు మగ్గుతున్నారన్నాడు వీరందర్నీ విడుదల చేయాలని గత ఆగస్టులో భద్రతామండలి ఆదేశించింది. దక్షిణాఫ్రికా సమితిని, నేరుగా భద్రతామండలిని ఉల్లంఘిస్తున్నదన్న మాట అని గినీ ప్రతినిధి దక్షిణాఫ్రికా విధానాన్ని నిరసిస్తూ ప్రత్యేక రాజకీయ సంఘము ప్రతిపాదించిన తీర్మానముపై మాట్లాడుతూ పేర్కొన్నాడు.

గత రాత్రి రాజకీయ సంఘములో దక్షిణాఫ్రికా నిరసన తీర్మానముపై 87-1 ఓట్లు వచ్చాయి. 9 రాజ్యాలు హాజరు కాలేదు. ఈ సంఘము సమావేశానికి దక్షిణాఫ్రికా ప్రతినిధి హాజరు కాలేదు.

అడినోవర్ రాజీనామా

బాన్, అక్టో 11

పశ్చిమ జర్మనీ ఛాన్సలర్ కోనార్డు అడినోవరు ఈవేళ ఫెడరల్ జర్మన్ రిపబ్లిక్ అధ్యక్షుడు హెన్రిక్ లూబ్కేకు తన రాజీనామాను అందజేశాడు.

వచ్చే మంగళవారం మధ్యాహ్నం నుండి అడినోవర్ రాజీనామా అమలులోకి వస్తుంది. అప్పుడు ఈరాజీనామా సంగతి అధికారికంగా అసెంబ్లీ అధ్యక్షుడు పశ్చిమ జర్మనీ పార్లమెంటులో ప్రకటిస్తాడు.

ఇప్పుడు అడినోవరు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న లడ్విగ్ ఎర్హార్డు పశ్చిమ జర్మనీ ఛాన్సలరుగా అధికార పూర్వకంగా నేడు ప్రతిపాదింపబడ్డాడు.

నేడే మున్సిపల్ కాంగ్రెసు పార్టీ సమావేశం

కార్యకర్తల ఎన్నిక నిమిత్తం

హైదరాబాద్, అక్టో 11

61 మంది సభ్యులుగల మున్సిపల్ కాంగ్రెసు పార్టీ రేపు కార్యకర్తల ఎన్నిక నిమిత్తం సమావేశం కాబోతోంది.

18 మంది కార్పొరేటర్లు రెండవ పర్యాయంగా కోరిన విమ్మట ఈసమావేశం ఏర్పాటైంది. మేయరు ఎన్నిక సందర్భంగా జరిగిన రభస దృష్ట్యా రేపటి ఈ సమావేశానికి ప్రాధాన్యము లభిస్తున్నది. తమ తమ అభ్యర్థుల్ని నిలిపేవిషయమై ఈవేళ మేయరు అనుకూలవర్గం వారూ ప్రతికూలవర్గము వారు వేర్వేరు సమావేశాలు జరిపారు.

ముఖ్యమంత్రి సంజీవరెడ్డి వెల్లడి:

మంత్రిమండలి సంఖ్య హెచ్చించే లేదా తగ్గించే భావం లేదు:

హైదరాబాదు, అక్టోబరు 11

ప్రస్తుతం తమ మంత్రి మండలి సంఖ్యను తగ్గించవలసిన లేదా హెచ్చించవలసిన ఆవశ్యకతఉన్నట్లు తాను భావించడం లేదని రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి నేడిక్కడ అన్నారు.

ఒక రాష్ట్ర మంత్రి వర్గానికి 20 మంది మంత్రులు ఉండాలని కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం నిర్దేశించిన పరిమితికి లోపే తన మంత్రిమండలి సంఖ్య(15] ఉన్నదని ముఖ్యమంత్రి అన్నారు.

పనివత్తిడి మూలాన మంత్రుల సంఖ్య పెంచాలని తాను భావిస్తే, ఆ విషయమై తాను పరిశీలిస్తానని శ్రీ సంజీవరెడ్డి చెప్పారు.

అయితే అలాంటి ప్రతిపాదన ఏమీ ప్రస్తుతం లేదని తెలిపారు.

పార్టీపని చేపట్టడానికి ఏ మంత్రినైనా విడుదల చేయాలని తాము భావించడంలేదని ముఖ్యమంత్రి విలేఖరుల సమక్షాన సమాధానమిస్తూ చెప్పారు.

సీనియర్ కాంగ్రెసు వాదులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య ఉన్నారనీ, వారి సేవలు సంస్థాగతమైన పనికి లభ్యమవుతాయని శ్రీ సంజీవరెడ్డి చెప్పారు.

ఒకవేళ అవసరమయ్యే పక్షములో పార్టీపని చేపట్టడానికిగాను ఏ మంత్రినైనా సరే విడుదల చేయడానికి తన కెట్టి అభ్యంతరం ఉండదని ముఖ్యమంత్రి చెప్పారు.

దేశ వ్యాప్తంగా 165 ఎన్.సి.సి. శిబిరాలు

ఈనెల, వచ్చేనెలలో లక్షమంది కేడెట్లకు శిక్షణ

న్యూఢిల్లీ, అక్టో 11

ఈ సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలల్లో 165 ఎన్.సి.సి. శిబిరాలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ శిబిరాలలో మొత్తం లక్షమంది కేడెట్లు శిక్షణ పొందుతారు.

మధ్యప్రదేశ్‌లో 49 శిబిరాలు, పశ్చిమ బెంగాల్‌లో 23, బిహారులో 20 శిబిరాలు ఏర్పాటవుతాయి.

దేశమంతటా ఇప్పుడు 2400 విద్యాసంస్థలలో 924 వేల మంది బాలబాలికలకు ఎన్.సి.సి. శిక్షణ గరపబడుతున్నది.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం

కేంద్రం చేపట్టాలని మరోమారు అభ్యర్థన

హైదరాబాద్, అక్టో 11

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రం తీసుకోవాలని తాము మరోమారు కోరినటుల ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడు తెలిపారు.

ప్రాజెక్టునిర్మాణానికై రాష్ట్రప్రభుత్వము ఏటా రు. 10 కోట్లు ఖర్చు చేయాల్సివస్తున్నది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎంతత్వరగా పూర్తి చేయబడితే అంత మంచిది. రాష్ట్రప్రభుత్వం దీన్ని ఈ విధంగా పూర్తి చేయాలంటే దాదాపు పదేండ్లయినా పడుతుంది. ఇక కేంద్రందీన్ని చేపట్టిన రెండు మూడేండ్లలో పూర్తి చేసి దేశ ఆహారకొరతను త్వరితగతి నతీర్చవచ్చును.

29 సంవత్సరాల జైలుజీవితం గల గఫార్ ఖాన్‌కు మరో 6 నెలలు డిటెన్షన్ పొడిగింపు

రావల్పిండి, అక్టో 11

పశ్చిమ పాకిస్థాన్ ప్రజా భద్రతా నిర్వహణ వ్యవహారాల ఆర్డినెన్స్ క్రింద ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ డిటెన్షన్ గడువు నేటి నుండి మరో ఆరు నెలలు పొడిగించబడింది.

గఫార్ ఖాన్ వయస్సు 73 సంవత్సరాలు. రెడ్‌షర్టు ఉద్యమ నాయకుడైనందున ఆయన పాక్ పాలనలో ఇప్పటికి రెండు సంవత్సరాల మందికి నిర్బంధింపబడిఉన్నాడు.

ఇటీవలగా ఖాన్ అబుల్ గఫార్ ఖాన్ 43 దినాలు నిరశన దీక్షపూనగా లాహోర్ సెంట్రల్ జైలు నుండి ముల్తాన్‌లోని నిస్తార్ ఆసుపత్రికి మార్చబడ్డాడు.

గఫార్ ఖాన్ తనరాజకీయనాయక జీవితములో ఇప్పటికి 29సంవత్సరాలు జైలుశిక్షలో నేగడిపాడు. స్వాతంత్ర్యసంపాదనానంతరం గడిచిన 13 సంవత్సరాలలో అధిక భాగము ఆయన పాకిస్తానులో రాజకీయ ఖైదీగా నే ఉన్నారు.

మున్సిపల్ ఖజానావద్ద పోలీసు కాపలా

హైదరాబాద్, అక్టో 11

మున్సిపల్ ఖజానా వద్ద పోలీసు గార్డు నియమించాలన్న కమీషనర్ సిఫారసును హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిసంఘం ఆమోదించినది. ఈ పోలీసుగార్డులో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు పోలీసు కానిస్టేబుల్స్ ఉంటారు.

ఆయుధాలు, మందుగుండు ఉంచడానికిగాను కార్పొరేషన్ ఆవరణలో ఒక గార్డురూము నిర్మించ వలసిఉంది.

నేపాల్ రాజదంపతుల ఖాట్మండు ప్రయాణం

భోపాల్, అక్టో 11

గ్వాలియర్‌లో నాలుగు రోజులు ఉన్న తర్వాత నేపాల్ రాజదంపతులు నేటి ఉదయం ఖాట్మండు వెళ్ళారు.

శ్రీ కె.డి. ధార్కర్ మృతి

నైజీరియన్ రైల్వే కార్పొరేషన్ ఆర్థిక సలహాదారు

లాగోస్, అక్టో 11

నైజీరియన్ రైల్వే కార్పొరేషన్ యొక్క భారతీయ ఆర్థిక సలహాదారు కె.డి. ధార్కర్ మొన్న రాత్రి మరణించారు, వీరి వయస్సు 57 సంవత్సరాలు.

పద్దెనిమిది నెలలక్రితం వీరు నైజీరియన్ రైల్వే కార్పొరేషన్ సర్వీస్‌లో చేరారు.

రిసర్చ్ మెథడాలజి వర్క్ షాప్

హైదరాబాద్, అక్టో 11

ఎజ్యుకేషన్ రిసర్చ్ సొసైటి, స్టేట్ టీచర్స్ యూనియన్‌ల సంయుక్తాధ్వర్యమున అక్టోబరు 14 నుండి 26వరకు పరిశోధనా పద్ధతుల వర్క్‌షాపు వై.ఎం.సి.ఎ. నారాయణగూడలో ఏర్పాటయినది.

4వ సంయుక్త వారం!

అలంకార్ చిత్రా (హైదరాబాద్) సమర్పించు:

నాగదేవత

—తెలుగు—

రీగల్ సెలెక్టు

ఖైరతాబాద్ బోలారం

ఆటలు: 3-15, 6-15, 9-30

—ఉపా ఫిలిమ్స్ విడుదల.

8వ సంయుక్త వారం

శ్రావ్యమైన పాటలతో ఉత్తమ వినోదం యిచ్చే చిత్రం.

రావల్ ఫిలిమ్స్:

దిల్ హితో హై

* రాజ్‌కపూర్, నూతన్, ప్రాణ్, నజీర్‌హుసేన్, సలితా ఛటర్జీ, లీలా చిట్నీస్, బాబులు, పద్మినీ ప్రియదర్శిని, ఆగ.

దర్శకత్వం: పి. ఎల్. సంతోషి, సి. ఎల్. రావల్

సంగీతం: రోషన్. పాటలు: సాహిర్.

జమ్‌ఖుద్ నటరాజ్

హైదరాబాద్ సికింద్రాబాద్

ఆటలు: 3-30, 6-30, 9-30.

పిక్చర్ ప్యాలెస్ - నిజామాబాద్

-శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల.

9వ సంయుక్త వారం!

ఈ సంవత్సరమునకు ఉత్తమ హాస్య రస చిత్రం

సుభాష్‌దేశాయ్ సమర్పించు:

బ్లఫ్ మాస్టర్



తా: షమ్మీకపూర్, సైరాబాను, లలితాపావర్, మోహన్ ఛోటి, టున్ టున్, ప్రాణ్.

దర్శకత్వం: మన్ మోహన్ దేశాయ్

సంగీతం: కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ

అశోక్ - హైదరాబాద్

ఆటలు: 3-15, 6-30, 9-30

—రమేశ్ ఫిలిమ్స్ విడుదల

గోలకొండపత్రిక

ఫోన్ నెం. 35280

12 అక్టోబరు 1968

శనివారము

కమ్యూనిస్టు చైనా కపటనాటకం

—(o)—

రెండురోజుల క్రిందట ఢిల్లీలో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుచు భారత ప్రధాన మంత్రి శ్రీ జవహర్లాల్ నెహ్రూ భారత, చైనా సరిహద్దు వివాదాన్నిగురించి ప్రస్తావించినారు. భారత, చైనా సరిహద్దు వివాద శాంతియుత పరిష్కారము కొరకు గడచిన సంవత్సరము కొలంబో రాజ్యాలు రూపొందించిన ప్రతిపాదనలను భారతదేశము సంపూర్ణముగా ఆమోదించినదని, ఇక జరుగవలసినది కమ్యూనిస్టుచైనా యీ ప్రతిపాదనలను సంపూర్ణముగా ఆమోదించడమని ప్రధానమంత్రి శ్రీ జవహర్లాల్ నెహ్రూ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుచు స్పష్టీకరించినారు. మనదేశానికి కావలసినది గౌరవప్రదమైన, న్యాయమైన శాంతియుత పరిష్కారము; అంతేగాని శాంతియుత పరిష్కారము పేరిట భారతదేశము కమ్యూనిస్టు చైనా యుద్ధోన్మాదముముందు మోకరించజాలదు. అందువలన కొలంబో రాజ్యాలు గడచిన సంవత్సరము సరిహద్దు వివాద పరిష్కారముకొరకు రూపొందించిన ప్రతిపాదనలను కమ్యూనిస్టు చైనా సంపూర్ణముగా ఆమోదించనంతవరకు యీ దేశముతో మన దేశము సంప్రదింపులకు కూర్చుండుట యన్నది సాధ్యముగాని పని. కొలంబో రాజ్యాల ప్రతిపాదనలను యెట్టి షరతులులేకుండా ఆమోదించనంతవరకు కమ్యూనిస్టుచైనాతో సంప్రదింపులు జరుపగూడదన్నది మొదటి నుండి మన విధానము; నేటికిని యీ విధానములో యెంత మాత్రమును మార్పు లేదని శ్రీ జవహర్లాల్ నెహ్రూ ఢిల్లీలో పత్రికా ప్రతినిధులతో మాట్లాడిన సందర్భమున ప్రకటించినారు.

సిలోన్, సమైక్య అరబ్ రిపబ్లిక్, ఇండొనీషియా, కాంబోడియా, ఘనా ప్రతినిధులు సింహళ రాజధాని కొలంబోలో సమావేశమయి భారత, చైనా సరిహద్దు వివాద పరిష్కారము కొరకు ప్రతిపాదనలను రూపొందించి దాదాపుగా సంవత్సరమగుచున్నది. కొలంబో రాజ్యాలు తమ ప్రతిపాదనలను మనకు సమర్పించిన వెంటనే మన దేశము వాటిని యెట్టి అరమరికలు లేకుండా ఆమోదించినది. కాని సంవత్సరము పూర్తి యగుచున్న ప్పటికిని యింతవరకు కమ్యూనిస్టు చైనా కొలంబో రాజ్యాల శాంతియుత ప్రతిపాదనలకు అంగీకారమును తెలుపలేదు. కొలంబో రాజ్యాల ప్రతిపాదనల మీద కమ్యూనిస్టు చైనాకు యెన్నో సందేహాలు మొలకెత్తినవి; చైనా కమ్యూనిస్టులకు వివరణలు కావలసివచ్చినవి; ప్రతిపాదనలను వివరించడానికి కొలంబో రాజ్యాల ప్రముఖ ప్రతినిధులు పెకింగ్ వరకు వెళ్ళినారు. కమ్యూనిస్టు చైనాలో కొలంబో రాజ్యాల ప్రతినిధులకు రాజరికపు మర్యాదలు జరిగినవి. ఈ మర్యాదల ఆర్భాటములో కొలంబో రాజ్యాలు తమ ప్రతిపాదనల మాట యెత్తినవో లేవో మనకు తెలియదు. మొత్తానికి ఈనాటి వరకు కొలంబో ప్రతిపాదనలను కమ్యూనిస్టు చైనా ఆమోదించలేదు; యింతవరకు ఆమోదించనందుకు కొలంబో రాజ్యాలు కమ్యూనిస్టు చైనాను కనీసము మ దలించనైనా మందలించలేదు.

గడచిన సంవత్సరము రూపొందింపబడిన ప్రతిపాదనలకు బూజుపట్టుతున్నది; యీ బూజును దులుపకుండానే అప్పుడే మరొక సమావేశాన్ని జరుపవలెనని, కొత్త ప్రతిపాదనలను రూపొందించవలెనని కొన్ని కొలంబో రాజ్యాలు ఉవ్విళ్ళూరుతున్నవి. ఇప్పుడిప్పుడే యీ కొలంబో రాజ్యాలకు చైతన్యము కలిగినట్లున్నది; ఒక వైపున ఘనా అధ్యక్షుడు మన ప్రధానమంత్రికి మరికొన్ని ప్రతిపాదనలను పంపినారట; మరొక వైపున ఢిల్లీలోని కొలంబో రాజ్యాల దౌత్యకార్యాలయాల వారు సందడిగా ఉన్నట్లు పత్రికా వార్తలవలన తెలియుచున్నది. ఈ కొత్త సమావేశము ఊహ వెనుక కమ్యూనిస్టుచైనా హస్తమున్నట్లు అనుమానము కలుగుచున్నది; కొలంబో ప్రతిపాదనలకు కాలదోషము పట్టించడానికి కమ్యూనిస్టు చైనా యీ కొత్త సమావేశాల కపట నాటక మాడుతున్నదని చెప్పవచ్చును. కొలంబో రాజ్యాల సమావేశములో తాను గూడా పాల్గొనవలెనని, కొలంబో రాజ్యాల సమావేశములోనే భారతదేశముతో తగవు జరుపవలెనని కమ్యూనిస్టు చైనా యెత్తువేయుచున్నది. అయితే కమ్యూనిస్టు చైనా పాల్గొనే కోలంబో రాజ్యాల సమావేశములో భారతదేశము పాల్గొనదని ప్రకటించి శ్రీ నెహ్రూ కమ్యూనిస్టుచైనా పన్నుగడను మొగ్గలోనే త్రుంచివేసినారు. ఎవరికి వారు శాంతి సంస్థాపకులమనే పేరు తెచ్చుకొనవలెనను తహతహను వదలివేసి నిజమయిన శాంతి కొరకు, న్యాయము కొరకు కృషి చేయనంతవరకు కొలంబో రాజ్యాల ప్రయత్నాలు సఫలము కాజాలవు.

సి.యస్.ఆర్. మృతిపట్ల డ్రామా ఎజ్యుకేషన్ సొసైటీ సానుభూతి

హైదరాబాద్, అక్టో 11

సి.యస్.ఆర్. మరణంపట్ల డ్రామా ఎజ్యుకేషన్ సొసైటి నిన్నటి రోజున నారాయణగూడలో జరిగినసభయందు యీ క్రింది సంతాపతీర్మానాన్ని ఆమోదించింది.

నాటక రంగము, సినీ రంగములకు ప్రతిభావంతమైన సేవచేసిన సి.యస్.ఆర్. అకస్మాత్తు మరణం రెండు రంగముల కళాకారులకు మానసికాంధకారాన్ని కలిగించింది.

తెలుగు పౌరాణిక నాటకములలో అగ్రస్థానము వహించిన సి.యస్.ఆర్. నిర్యాణంతో పౌరాణిక నాటక ప్రగతికి తీవ్ర ప్రతిఘాతం చేకూరినది, సి.యస్.ఆర్. ప్రఖ్యాతికి ఉచితముగా స్మారక చిహ్నం యేర్పాటు చేయడం రాష్ట్ర ప్రజానీకం విధి! సమావేశమునకు కాలేజ్ ఆఫ్ ఎజ్యుకేషన్ ఉపన్యాసకులు శ్రీ సి.యస్. సుబ్బారావు అధ్యక్షత వహించారు.

శోభకృత్ సం॥ అధిక ఆశ్వయుజ దశమి ప 11-53 ఆశ్లేష రా 9-31 ఉ వ 9-56 మొ: 11-35 వరకు (శాలివాహన శకము: 20-7-1885) 12-10-1968 శనివారము

> "విను విప్రశరీరము సుఖమునకే బహు నియమదుఃఖముల నిహమునఁ జెందనునిత్యసౌఖ్యముం బరమునఁ బొందను బుట్టెఁ గాక బోధ ప్రవణా."
>
> —భారతము (శాంతి)

కామారెడ్డిలో మోటార్ డ్రైవర్ల, క్లీనర్ల సంఘం

(గోలకొండపత్రిక విలేఖరి)

కామారెడ్డి, అక్టో 11

ఇక్కడి మోటారు డ్రైవర్లు మరియు క్లీనర్ల సంఘం స్థాపించబడినది. వీరందరు చక్కగా అలంకరించబడిన లారీల ద్వారా గొప్ప ఊరేగింపు జరిపిరి. తరువాత గంజులోని గాంధీ విగ్రహమువద్ద సమావేశమై ఈ సంఘమునకు అధ్యక్షులుగా మొహమ్మద్ సర్వర్ (మున్సిపల్ కౌన్సిలర్) ను, ప్రధాన కార్యదర్శిగా ఎస్. రాజా గౌడ్ (మున్సిపల్ కౌన్సిలర్)ను ఏకగ్రీవముగా ఎన్నుకొని ఇతరకార్యవర్గమును నిర్ణయించుటకు వీరికి పూర్తి అధికారములను ఇచ్చిరి. అనంతరము ప్రత్యేక ఆహ్వానముపై హైదరాబాదు నుండివచ్చిన సుందర్ అండ్ పార్టీ వారి కవ్వాలి జరిగెను. ఈ సమావేశమునకు పురప్రముఖులు మరియు వ్యాపారస్తులుగూడ హాజరైరి.

మధ్యప్రదేశ్‌లో దోపిడి నేరాలు

భోపాల్, అక్టో 11

1962 మే నుండి 1963 ఫిబ్రవరి వరకు మధ్యప్రదేశ్‌లో 91 మంది దోపిడి దొంగలు అరెస్టుచేయబడినారు.

నిన్న శాసన సభలో ముఖ్యమంత్రి డి. పి. మిశ్రా ఈ వివరాల తెలిపారు. పై సమిజా కాలంలో 449 దోపిడి కేసులు జరిగాయి.

అక్టోబరు 15 నుండి విస్తరణ:

నగరంలోని పెక్కు ప్రాంతాలకు షటల్ సర్వీసుల రూట్

హైదరాబాద్, అక్టో 11

ప్రస్తుతం హైదరాబాద్‌లో నడుస్తున్న సర్క్యులర్ షటల్ సర్వీసులు, నగరంలోని పెక్కు ప్రాంతాలలో కూడా తిరగడానికిగాను అక్టోబరు 15 నుండి వాటి రూటును రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విస్తరించనున్నది.

ప్రస్తుతం కార్పొరేషన్ ఎనిమిది బస్సులను నడుపుతున్నది. ఈసర్క్యులర్ షటల్ సర్వీసులుఈక్రిందిరూట్లలో ఇప్పుడు నడుస్తున్నవి:

రెసిడెన్సీ - ఆబిడ్ - నాంపల్లి - పబ్లిక్ గార్డెన్స్ - లకిడీకా పూల్ - సెక్రటేరియట్ - టాంక్ బండ్ - బషీర్‌బాగ్ - ఆబిడ్ - రెసిడెన్సీ మరియు రెసిడెన్సీ - ఆబిడ్ - బషీర్ బాగ్ - టాంక్ బండ్ - సెక్రటేరియట్ - లకిడీకాపూల్ - పబ్లిక్ గార్డెన్స్ నాంపల్లి - ఆబిడ్ - రెసిడెన్సీ

ప్రతిరూట్‌లోనూ నాలుగు బస్సులు నడుస్తున్నవి.

అక్టోబరు 15 నుండి ఈ బస్సులు బషీర్‌బాగ్ వద్దనుండి, యమ్.ఎల్.ఏ. క్వార్టర్సు, హిమాయత్‌నగర్, దీపక్ మహల్, సుల్తాన్ బజారుమీదుగా రెసిడెన్సీ చేరుకుంటాయి.

ఈ సర్క్యులర్ ట్రిప్పుకు 37 నిమిషాలసేపు ప్రయాణంచేయవల్సివస్తుంది. సామీప్య దూరంగల ప్రయాణంచేసి, అవీ-ఇవీ కొనదలుచుకునే ప్రయాణీకులుసౌకర్యంకోసం ఈ సర్క్యులరు షటల్ సర్వీసులను కార్పొరేషన్ ప్రవేశపెట్టినది. దీనివల్ల దూరప్రయాణీకులకు మిగతా బస్సులలో ఎక్కువ స్థలం దొరుకుతుంది.

యు. పి. మంత్రి మండలి నిర్మాణంపై అంగీకారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 11

నేటి ఉదయం కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి ఉత్తర ప్రదేశ్‌కు 21 మంది సభ్యుల మంత్రిమండలి ఉంటుంది.

ఈ మంత్రి మండలిలో 16 గురు క్యాబినెట్ మంత్రులు 5 గురు డిప్యూటి మంత్రులు ఉంటారు. క్యాబినెట్ హోదా మంత్రులలో భిన్నవాదుల ప్రతినిధులు 5 గురు, డిప్యూటి మంత్రులలో ఇద్దరు ఉంటారు.

యు. పి. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీలోని ఇరువర్గాలవారు తమ ఈ ఒప్పందాన్ని హైకమాండ్‌కు తెలియపరిచారు.

ఈఒప్పందం క్రింద బనారసి దాస్, దాదయాల్ ఖన్నా, మహావీర్ ప్రసాద్ శ్రీ వాత్సవ, డా॥ సీతారామ్, జగ్ మోహన్ సింగ్ నగి, రామమూర్తి లేక్ సైలాస్ ప్రకాశ్, కమలాత్రిపాఠి, చరణ్ సింగ్, చతుర్ భుజ్ శర్మ, జగన్ ప్రసాద్ రావత్, సయ్యద్ అలి జహీర్ మంత్రులుకాగలరనితలచబడుతున్నది.

ఇక మంత్రులుగా వినబడుతున్న పేర్లు హెచ్. ఎస్. బహుగుణ, బలదేవ్ సింగ్ ఆర్య, శాంతి ప్రసన్న శర్మ నవల్ కిశోర్, బన్సిధర్ పాండే.

కాంగ్రెస్ అధ్యక్షతకు కామరాజ్ ఎంపిక

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి ప్రశంస

హైదరాబాద్, అక్టో 11

కాంగ్రెస్ అధ్యక్షతకు కామరాజ్‌ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటి ప్రతిపాదించ నిర్ణయించడం కాంగ్రెస్ సంస్థ మరియు దేశప్రయోజనాల దృష్ట్యా సముచితంగా ఉన్నదని ఢిల్లీనుండితిరిగి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ సంజీవ రెడ్డి అభిప్రాయ పడినారు.

ఎట్టి పరిస్థితులలోను కాంగ్రెస్ అధ్యక్షతను స్వీకరించకుండా ఉండుటకు లాల్ బహద్దుర్ శాస్త్రి తలపెట్టారని గూడా ముఖ్యమంత్రి తెలిపారు.

మహారాష్ట్రలో పొడుగు పింజా ప్రత్తిపంట

బొంబాయి, అక్టో 11

మహారాష్ట్రలో ఈ సంవత్సరము పొడుగు పింజాప్రత్తి పెంపకంగతసంవత్సరంకన్నా 50 శాతం పెంచబడినది. ఈఏడు ఈ రకం ప్రత్తిని వేసిన భూమి 2250 ఎకరాలు.

కాశ్మీరు నూతన మంత్రివర్గ నిర్మాణానికి ఆహ్వానం

శ్రీనగర్, అక్టో 11

జమ్మూ-కాశ్మీరు కొత్త మంత్రి వర్గానికి నాయకత్వం వహించవలసినదిగా సర్దారె రియాసత్ డాక్టరు కరన్ సింగ్ షమ్‌సొద్దీన్‌ను కోరారు.

నేషనల్ కాన్ఫరెన్స్ లెజిస్లేచర్ పార్టీ నాయకునిగా నిన్న షమ్‌సొద్దీన్ ఎన్నికయినారు.

నూతన మంత్రి మండలి రేపు ప్రమాణస్వీకారాన్ని చేస్తుంది.

శ్రీ సంజీవయ్య మైసూరు పర్యటన

సికింద్రాబాద్, అక్టో 11

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ దామోదరం సంజీవయ్య అక్టోబరు 15 నుండి మైసూరురాష్ట్రంలో పర్యటన ప్రారంభించి, అక్టోబరు 23న హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ఒకరోజు ఇక్కడ ఉండి, తిరిగి అక్టోబరు 24న ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.

భారతదేశపర్యటనకు ఉగాండా ప్రధాని అంగీకారం

కంపాలా, అక్టో 11

ఉగాండా ప్రధాని మిల్టన్ ఒబోటె భారతదేశ పర్యటనకు అంగీకరించారు భారతదేశ వ్యవహారాలశాఖ ఉపమంత్రి దినేశ్ సింగ్ ప్రధాని నెహ్రూ పక్షాన ఈ ఆహ్వానాన్ని అందించారు. బహుశః వీరు వచ్చేసంవత్సరం ఫిబ్రవరిలో భారతదేశానికి రాగలరు.

దేవీ నవరాత్రి ఉత్సవములు

సికింద్రాబాదు, అక్టో 11

స్వస్తిశ్రీ శోభకృన్నామసంవత్సర నిజ ఆశ్వయుజ శుద్ధ ప్రతిపద మొదలుకొని విజయదశమివరకు శ్రీ రామాలయము సత్యనారాయణపురమునందు దేవీ నవరాత్రోత్సవములుజరుపబడును.

ఉదయం-సాయంత్రం పూజ,పారాయణము, సహస్రనామార్చనాదులు ఉపన్యాసములు, సంగీతకచేరీలు జరుగును.

విద్యార్థి దారుణమృతి

శాదేపల్లిగూడెం, అక్టో 11

పాఠశాలనుండి ఇంటికి తిరిగివస్తూన్న ఒక విద్యార్థిమీదుగా లారీ వెళ్ళడముతో చనిపోయాడు. ఆ విద్యార్థి ఆరవతరగతి చదువుతున్నాడు. లారీ డ్రైవరు అరెస్టయ్యాడు.

ఉజ్జయినిలో కాళిదాస జయంతి ఉత్సవాలు

ఉజ్జయిని, అక్టోబరు 11

వచ్చేనెల 27వ తేదీనుండి ఉజ్జయినిలో కాళిదాస జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇవి వారము రోజులపాటు జరుగుతవి.

చౌటుప్పల, మునుగోడు బ్లాకుల్లో కాటక పరిస్థితి: పంటల దుస్థితి

హైదరాబాదు, అక్టో 11

"మునుగోడ్, చౌటుప్పల బ్లాకులలో తీవ్రమైన కాటక పరిస్థితులు ఏర్పడిన కారణముగా ఈ సంవత్సరం పంటలు పూర్తిగా చెడిపోయినవి. పునాసపంటలు ముఖ్యంగా-వేరుసెనిగ, జవార్, బజ్రా-ఎండిపోతున్నవి. వర్షాలు పడకపోవడంవల్ల వేరుసెనగ పంటను పాలంమండి తీయడానికి చాలా కష్టమవుతున్నది." అని చిన్నకొండూరు నియోజకవర్గం శాసనసభ్యుడు శ్రీ. కె. గురునాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భూమి ఎండిపోయిన కారణముగా దున్నడంచాలాకష్టమవుతుంది. పొగాకు నాటడం జరిగింది కానీ తగినంతగాదున్నబడలేదు. పెద్దపెద్ద చెరువులు, కుంటలలోనూ నీళ్ళు లేకుండా పోతున్నది. బావినీరు కూడా చాల తక్కువ స్థాయికి చేరుకున్నది. కొన్ని ప్రాంతాలలో పశువులకు సైతం తగినంతనీరు లభ్యంకావడంలేదు.

పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, వెలిమినేడు; అయిపురు, పెరెవల్లి, గుర్రాంపల్లి, తంగడెపల్లి, పంతాంగి, సిరిరంపురం, వల్లంకి, చౌటుప్పల్, నారాయణపురం, సారవేలు, గుజ్జా, కిష్టాపురము, పాలివేలు, మునుగోడ్, విప్పర్తి, తల్లవెల్లిమ్‌లా, యుకొండ' వెల్లికట్టి, కొంపల్లి గ్రామాలు దెబ్బతిన్నవని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ కూలీలకు పనికల్పించే నిమిత్తం రోడ్డు నిర్మాణపుపని చేపట్టాలని, శిస్తుతగావి బకాయిల, వసూళ్ళు వాయిదా వేయాలనీ, కొత్తగాతగావి అప్పులు, సబ్సిడీలు మంజూరు చేయాలనీ, ఆ విధంగా వ్యవసాయ పనులు కొనసాగలవని శ్రీ గురునాథరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్రీ వై. బి. చ్యవన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 11

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల వ్యవహారాల పర్యవేక్షించడానికి కాంగ్రెస్ పార్లమెంటరీబోర్డు శ్రీ వై.బి. చ్యవన్‌ను నియోగించింది.

డెహ్రాడూన్‌లో ప్రధాని నెహ్రూ విశ్రాంతి

డెహ్రాడూన్, అక్టో 11

పాల్గురోజుల విశ్రాంతికై ప్రధాని నెహ్రూ నేటిఉదయం ఇక్కడికి వచ్చారు. విరివెంట శ్రీమతి విజయలక్ష్మి పండిత్ కూతురు చంద్రలేఖ వచ్చింది.

రోదసిలో సుదూర యాత్రలకు సన్నాహం

మాస్కో, అక్టో 11

ప్రప్రథమ కృత్రిమ ఉపగ్రహం ఎగురవేత 6వ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తూ సోవియట్ శాస్త్రవేత్త టిగ్రన్ మెల్కుమోవ్ "సమీప భవిష్యత్తులో అణుశక్తి చోదితమైన పెద్ద రోదసీనౌకలు అంతరిక్షంలో ప్రయాణించడం మనం చూస్తాము" అన్నారు.

రోదసీ యాత్రికుడు వాలెరీ బైకోవ్‌స్కీ యూనభలో ప్రసంగిస్తూ రోదసీ యాత్రికుల శిక్షణగురించి, వాలెంతీనా తెరెష్కోవాతో తన రోదసీయాత్రను గురించి చెప్పారు.

రోదసీనౌకల నిర్మాణం గురించి చెబుతూ "భవిష్యత్తులో అనేక మందికి స్థలముండే పెద్దనౌకలు నిర్మించబడడం చూడగలం" అన్నారు.

ప్రస్తుతంరోదసిలో సుదూరయాత్రలకై అనువైన రోదసీనౌకల నిర్మాణం విషయమై కృషి జరుగుతున్నదనీ, అలాంటి ప్రయాణాలకై రోదసీ యాత్రికులకు శిక్షణ ఇవ్వబడుతూందనీ ఆయన చెప్పారు.

8వ అంతర్ విశ్వవిద్యాలయ యువజనోత్సవాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 11

నవంబర్ నెల 11 నుండి ఢిల్లీలో జరుగబోయే 8వ అంతర్ విశ్వవిద్యాలయ యువజనోత్సవాలలో పాల్గొనడానికి 26 విశ్వవిద్యాలయాలు అంగీకరించాయి.

వారంరోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ప్రధాని నెహ్రూ ప్రారంభోత్సవం చేస్తారు.

"6 నెలల వేతనం డెట్ రిలీఫ్ బోనస్" మంజూరు చేయాలి

నగర ఉపాధ్యాయ సంఘం అభ్యర్థన

హైదరాబాద్, అక్టో 11

నిన్నటి సాయంత్రము గోషామహల్ ప్రభుత్వోన్నత పాఠశాలలో జరిగిన స్టేట్ టీచర్సు యూనియన్ సిటీ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తుత విపరీత జీవన ప్రమాణాల పెరుగుదల దృష్ట్యా ఉపాధ్యాయులకు మద్రాసు రాష్ట్రంలో వెనుకచేసిన చట్టపద్ధతిలో "6 నెలల వేతనం డెట్ రిలీఫ్ బోనస్" మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రధాన తీర్మానం ఆమోదింప బడినది.

సమావేశమునకు శ్రీ వామన్ రావు అంజుట్టిస్థానే కొత్తగా నగర పాధ్యాయ సంఘమునకు అధ్యక్షులుగ ఎన్నికయిన శ్రీ వి. సుబ్బారావు అధ్యక్షతవహించారు.

రాష్ట్రములోని బి. యెడ్. కళాశాలల ఉపాధ్యాయ విద్యార్థులకు పూర్తివేతనాలను, క్రొత్తవిద్యార్థులకు స్టయిఫండ్ మంజూరు చేయాలనియు ప్రభుత్వాన్ని కోరుతూ మరియొక తీర్మానం చేయబడింది.

రు. 80-150 గ్రేడులో పోస్టుగ్రాజ్యుయేట్లు పని చేయుచుండడం, విద్యాశాఖలో విపరీత జాప్యము, సీనియర్ ఉపాధ్యాయుల అక్రమమయిన తొలగింపు, రెండవ గ్రేడు పండిట్ల నుండి "రికవరీలు" రిటైర్మెంటు ఎక్స్‌టెన్షన్ మంజూరి అలస్యం, సమావేశం ఖండించి విద్యాశాఖ పాలన ఉపాధ్యాయుల సంక్షేమము, న్యాయములకు దోహద మివ్వాలని కోరింది. ఉపాధ్యాయులకుసహకారగృహనిర్మాణ సంస్థ యేర్పాటు చేయుటకయి ఒక సంఘాన్ని నియమించింది. సహకార ఉద్యమంలో ప్రశంసనీయముగ ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొను చుండుట పట్ల హర్షము ప్రకటించింది.

యూనివర్సిటీ పరీక్షలకు హాజరయ్యే దినాలు డ్యూటి దినములుగ పరిగణించాలనియు, ప్రధానోపాధ్యాయుల అలవెన్సును తక్షణం మంజూరుచేయాలనియు,ఉపాధ్యాయులకు బస్‌కన్సెషన్‌లను వర్తింప చేయాలనియు యితర తీర్మానములో అర్థింపబడింది.

సిటీ యూనియన్ కార్యకలాపాలను కార్యదర్శి శ్రీ ఈ. వరదరాజులు నివేదించారు. స్టేట్ టీచర్సు యూనియన్ ప్రధానకార్యదర్శి శ్రీ కె. విద్యోగింద్ర, శ్రీ వామన్ రావు అంజుట్టి నూతనాధ్యక్షుని అభినందించారు. సెక్టర్ వారి సమస్యల సమగ్రముగా చర్చింపబడినవి.

కోయలి నూనెశుద్ధి కర్మాగారం

బరోడా, అక్టోబరు 11

కోయలి నూనెశుద్ధి కర్మాగారాని కయి రవ్వన్ యంత్రసామగ్రి కొంత వచ్చింది. ఈ నూనెశుద్ధి కర్మాగార నిర్మాణం జరుగుతున్నది.

లేఖావళి

షాద్‌నగర్ సమితి ఉపాధ్యాయుల కష్టాలు

ఆర్యా!

షాద్‌నగర్ పంచాయతీ సమితిలో పనిచేసే ఉపాధ్యాయులకు పండుగల అప్పు రెండు సంవత్సరముల నుండి ఇవ్వడములేదు. దసరా సెలవులలో స్వంత గ్రామములకు పోవు ఉపాధ్యాయులకు ఈ అప్పు ఇవ్వనందున వారు చాలా బాధపడుచున్నారు.

ప్రతి సంవత్సరము ఇచ్చే ఇంక్రిమెంట్లు షాద్‌నగర్ సమితి ఉపాధ్యాయులకు 1-11-1962లో రావలసియుండెను. అట్టి ఇంక్రిమెంట్లు ఒక సంవత్సరమునుండి ఇవ్వక 1963సెప్టెంబరు నెలలో మంజూరి చేసినారు.

ఈ విధముగా వారికి సకాలమునకు ఇవ్వనందున వారు కష్టపడుచున్నారు. ఈ సంవత్సరమయినా దసరా పండుగ అప్పు ఇచ్చినయెడల వారికి చాల ఉపయోగముగా యుండును.

ఇట్లు

ఒక ఉపాధ్యాయుడు

యు. పి. మంత్రివర్గ వ్యవహారం

లాల్ బహద్దుర్ శాస్త్రి, పాటిల్‌ల కృషి

న్యూఢిల్లీ, అక్టోబరు 11

యు. పి. లో కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీలోని రెండువర్గాల మధ్య సామరస్యాన్ని సాధించి మంత్రివర్గ నిర్మాణానికి తోడ్పడుటకయి కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు లాల్ బహద్దుర్ శాస్త్రి, ఎస్. కె. పాటిల్‌ను నియోగించినది.

లాల్ బహద్దుర్ శాస్త్రి, ఎస్. కె. పాటిల్ యు. పి. ముఖ్యమంత్రి శ్రీమతి సుచేతా కృపలానీమరియు కమలాపతిత్రిపాఠితో సంప్రదించారు.

చిన్మయా మిషన్ వార్షికోత్సవ కార్యక్రమాలు

సికింద్రాబాద్, అక్టో 11

అక్టోబరు 12, 13 తేదీలలో చిన్మయా మిషన్, సికింద్రాబాదు తృతీయ వార్షికోత్సవ కార్యక్రమ వివరాలు- 12వ తేదీ సాయంత్రము 6 గంటలకు అవులమంద కన్యాకాపరమేశ్వరి ఆలయములో శ్రీఘంటాచెర్ల రామారావు అధ్యక్షతను బహిరంగ సభ జరుగును.

తాగూర్ హోంచే విద్యార్థుల ప్రార్థన, మిషన్ సభ్యులచే భజగోవిందం, కీర్తనలు నిర్వహింపబడును. మిషన్ ప్రధానకార్యదర్శి శ్రీ యు. యస్. కోటీశ్వరన్ "స్వామి వివేకానంద జీవితము"పై ప్రసంగించెదరు.

13వ తేదీ ఉదయము 8 గంటల నుండి సాయంత్రము 6 గంటల వరకు మీరాలంచెరువు వద్దనున్న సాలార్ జంగ్ అతిథిగృహంలో ఉదయము "త్రైతేయ ఉపనిషద్" సాయంత్రము భగవద్గీత 13వ అధ్యాయమునకు సంబంధించిన "అత్యధికకాలము అత్యధిక సంఖ్యకు అత్యధికసౌఖ్యము"అను శీర్షికలపై గోష్ఠులు జరుగును.

రాష్ట్రకాంగ్రెసులోని ప్రత్యర్థి వర్గాల మధ్య సామరస్య సాధనకు శాస్త్రి కృషి

అక్టోబరు 23న నగరానికి రాక

హైదరాబాదు, అక్టోబరు 11

కేంద్రమాజీహోంమంత్రి శ్రీలాల్ బహద్దూర్ శాస్త్రి అక్టోబరు 23 నాడు స్వల్పకాల పర్యటనపై హైద్రాబాదుకు రానున్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసే కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగింస్తారు. అంతేకాకుండా అదేరోజు స్వామి రామానందతీర్థ సర్వోత్సవాలకు అధ్యక్షత వహిస్తారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల సమావేశంలో కూడా శాస్త్రి ప్రసంగించగలరని భావిస్తున్నారు.

రాష్ట్రకాంగ్రెసులోని ప్రత్యర్థి వర్గాల మధ్య సామరస్యసాధనకుగాను ప్రదేశ్ కాంగ్రెస్ నాయకులతో సంభాషిస్తారు.

ప్రదేశ్ కాంగ్రెస్ కార్యవర్గాన్నిరద్దు చేసే ఆవశ్యకతను దానిస్థానంలో అడ్‌హాక్ కమిటి ఏర్పాటుపై పత్రికల వర్గంవారు. శ్రీశాస్త్రికి నచ్చచెప్పగలరని తెలుస్తున్నది.

వరంగల్‌లో అక్టోబర్ 25న చర్మకారుల మహాసభ

వరంగల్, అక్టో 11

వరంగల్ జిల్లా చర్మకారుల సంఘ ప్రథమ మహాసభ నిమిత్తము ఇటీవల నూర్ మహమ్మద్ కార్యాన ఆవరణములో శ్రీ పి. కోర్నెలుసిటిచర్మకార సంఘ అధ్యక్షతలో, వరంగల్ పట్టణ చర్మకారులు మరియు హరిజన కార్యకర్తలు వంద మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సమావేశములో శ్రీ మందసాయిలు (జిల్లా చర్మకార సంఘ అధ్యక్షులు) బి. నారాయణ మంద కొమ్మయ్య బి. ఆనందము, మేకల వీరయ్య, బోగుల మల్లయ్య, టి. లక్ష్మణ్, తదితర ప్రముఖ కార్యకర్తలు అక్టోబర్

మొ యి ను ద్దౌ లా గోల్డ్ కప్
ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్
ఫైనల్
A. C. C. XI మరియు విజయనగరం XI ల మధ్య
ఫతేమైదాన్ కవర్డ్ పిక్చెట్‌లో అక్టోబర్ 12, 13, 14, 15
తేదీలు జరుగును.
ప్రవేశ రుసుము :- కుర్చీలు:- ప్రతిరోజు రు. 1-50 న. పై.
గ్యాలరీ: ప్రతిరోజు రు. 0-75 న. పై.
మరుసటిరోజు ఆటకై ప్రతిరోజు సా॥ 4-0 గం॥ నుండి అడ్వాన్సు బుకింగ్.

గాంధీ జయంతి

హైద్రాబాద్, అక్టో 11

7-10-1963 సోమవారం సాయంత్రము 6 గంటలకు శ్రీ వేమన ఆంధ్ర భాషానిలయంలో శ్రీ నోడూరి బాల సుందరంగారి అధ్యక్షతనగాంధీజయంతి బహిరంగసభ జరిగింది. సేవాగ్రంలో గాంధీజీతో పనిచేసినట్టియు, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సర్వోదయమండలి అధ్యక్షులునుఅగు శ్రీ ప్రభాకర్‌జీ తాను సేవాగ్రంలోనున్నపుడు తనకు గలిగిన అనుభవములను పెక్కింటిని వివరించారు. ఒక జయంతి ఉత్సవ సందర్భంలో గాంధీజీకి అనేక కానుకలు వచ్చినవట. ఆయన ప్రక్కనేయుండి మిన్నకుండిన కస్తూరిబాను చూచి నీకు నీ జయంతి ఉత్సవమును కూడ చేసికొనవలెనని యున్నట్లున్నదని ఛలోక్తిగా అన్నారట.

సబర్మతి ఆశ్రమములోను, సేవాగ్రంలో అనేక మార్పులు గాంధీజీతో చర్చలు జరిపిన శ్రీమాన్ ఆత్మకూరు గోవిందాచార్యులుగారుమాట్లాడుచూ ఇలా అన్నారు; జయంతి ఉత్సవాలు తద్దినాలు పెట్టుటవంటివికావు. ఎవరి జయంతి జరుపుచున్నామో వారి ఆశయాలను ఆచరణలో పెట్టవలసియుంటుంది గాంధీజీ స్వరాజ్యం తెచ్చారు. అవతార పురుషులు స్వరాజ్యం రామరాజ్యం కావలెనన్నారు. మానవులు అందరు అహింస-సత్యముల నాచరించి దైవసములు కావాలి. కాని వారి ఉపదేశాలనన్నింటిని వారి శిష్యవర్గము అస్తులతోపాటు పవిత్ర నదులలో కలిపివేశారు. ఇప్పుడు స్వపరిపాలనలోసుపరిపాలనలేదు. కనుక ప్రజలలో అహింస-సత్యములు లేకుండా పోయినవి. అవినీతి,హింసతాండవించుచున్నది. గాంధీజీ మట్టిలోనుండి మనుష్యులను తయారు చేశాడు. వీరులను సృష్టించాడు. వారి ద్వారా స్వరాజ్య సాధనకు యత్నించారు. ఆనాటి వారు ఇప్పటికీ కొంత మంది ఉన్నారు. కాని వారిలోఆనాటి శక్తిమాత్రము ఈనాడులేదు. శ్రీకృష్ణ నిర్యాణము తరువాత అర్జునుడు నిర్వీర్యుడయినాడు. అలాగే. గాంధీజీ నిజమైన శిష్యులు నిర్వీర్యులైనారు; ఏమీ చేయజాలక కుందుచున్నారు. నాడు రవియస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సింహపుజూలుపట్టి ఊపించగలిగిన వారే నేడు స్వరాజ్య ప్రభుత్వమున, అవినీతితాండవమాడుచుండగ ఏమియు చేయలేక దిక్కులవంక తెల్లమొగము వేసి చూచుచున్నారు. నిజమైన గాంధీ తత్వజ్ఞులందరు సుపరిపాలనలభించుటకు చేయవలసిన కృషి చేయుటయే గాంధీజీని స్మరించుట; ఆయనకు నమోవాత్యములర్పించుట.

అధ్యక్షులు ఈ గ్రంథాలయము వంటి సంస్థలో ఒక కమిటీని ఏర్పాటు చేసి గాంధీసూక్తుల ప్రచారము చేయవలెనన్నారు. కార్యదర్శి వందనములతో సభ ముగిసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటు
టెండర్ నోటీసు
దిగువ నుదహరించిన పనులకొరకు (పోచంపాడ్ ప్రాజెక్టు ఆర్మూర్ తాలూకా నిజామాబాద్ జిల్లా ఆం-ప్ర.) రిజిష్టరు చేయబడిన క్లాస్ 1 కంట్రాక్టర్లు మరియు పేరుపొందిన సంస్థలనుండి సీలుచేయబడిన టెండర్లు కోరబడుచున్నవి.

క్రమ సంఖ్య	పని పేరు	కంట్రాక్టు యొక్క అంచనా	అర్నెస్టు డబ్బు బ్యాంకు చలాను రూపంలో	టెండరు పత్రం విలువ సేల్సు ట్యాక్సుతో సహా (తిరిగి ఇవ్వబడనిది)	పనిపూర్తి చేయుకాల పరిమితి	టెండర్లు తీసుకొనుటకు చివరి తేదీ, వ. 3 గం. పగలు
1.	గోదావరిదక్షిణకాలవత్రవ్వుటము మైలు నెం.1 గొలుసు 11.00 నుండి గొ॥ 52.80 వరకు.	5,16,000	12,900	టెండరు పత్రము (వ ప్లాన్) పేజీ 1 కి రు. 1-00 చొప్పున	ఒక సంవత్సరము	12వ నవంబర్ 1963
2.	-డిటో- మైలు నెం. 2 గొ॥ 52.80 నుండి 105.60 వరకు.	7,41,000	18,525	-డిటో-	-డిటో-	-డిటో-
3.	-డిటో- మైలు నెం. 3 గొ॥ 105.60 నుండి 127.50 వరకు.	9,44,000	23,600	-డిటో-	-డిటో-	-డిటో-

1. టెండరు L. S. పద్ధతిన ఉండును.
2. టెండర్లు సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. డబ్ల్యు. డి. గోదావరి వ్యాలీ సర్కిల్, కాషానెఖమడ్, ఆఖంజాహిరోడ్, కాచిగూడ, హైద్రాబాదు (ఆం-ప్ర.) గారిచే ఆయావనులకు ఎదురుగా చూపబడిన తేదీలలో తీసుకొనబడును. మరియు అదేరోజు పగలు 3-30 గంటలకు తెరువబడును.
3. టెండరు ప్రతులు సూపరింటెండింగ్ ఇంజనీరు, పి. డబ్ల్యు. డి. గోదావరి వ్యాలీ సర్కిల్ ఆఫీసులో దరఖాస్తు పెట్టినచో నవంబరు 5వ తేదీ 1963 నుండి ఆఫీసు వేళలలో పొందవచ్చును. అట్టి దరఖాస్తులు 30 అక్టోబర్ 1963 వరకు మాత్రమే స్వీకరించబడును.

పై పనుల గురించి అవసరమగు ఇతర విషయములు దిగువ సంతకము చేసినవారి ఆఫీసునుండి పొందవచ్చును.

(సం.)
సూపరింటెండింగ్ ఇంజనీరు, పి. డబ్ల్యు. డి.
గోదావరి వ్యాలీ సర్కిల్, హైద్రాబాద్ (ఆం-ప్ర)

శ్రీ త్యాగరాజ
* నౌకాచరిత్రం *
(సంగీత నృత్య నాటిక)

కుమారి కమల, ఆమె బృందం
(రాధ, వాసంతి, లక్ష్మి, చంద్ర, షీల)
కృష్ణుడు, గోపికల కథగల చక్కటి సంగీత నృత్య ప్రదర్శన
నిర్వహణ: కమల
ప్రసిద్ధ నర్తకి లయకు, సుప్రసిద్ధ సంగీత దర్శకుని తాళానికి చక్కటి సమ్మేళనం
హైదరాబాదులో
అక్టోబరు 13, 14 తేదీలలో సాయంకాలం 6-30 గం.కు
రవీంద్రభారతిలో ప్రదర్శించబడును
టిక్కెట్లు రవీంద్రభారతివద్ద ఉ॥ 11 గం. నుండి సా॥ 6 గం. వరకు అమ్మబడును.
నిర్వాహకులు: విశ్వకళా ఇంప్రెసరియస్, రవీంద్రభారతి మేనేజింగ్ కమిటీ
—: జాతీయ రక్షణ నిధికి :—
ఆంధ్రప్రదేశ్ పౌర రక్షణ సంఘం నిర్వహిస్తున్న ప్రదర్శన.

విద్యావిధానంలో ఆధ్యాత్మిక విలువలకొరతే క్రమశిక్షణా రాహిత్యానికి హేతువు

హైద్రాబాదు, అక్టో 11

గాంధిజయంత్యుత్సవ సందర్భమున ప్రభుత్వోన్నతపాఠశాల, జ మీస్తాన్‌పురలో 7 వ తారీఖున యేర్పాటయిన గోష్ఠియందు ప్రసంగించుచూ గాంధీజీ మహాత్ముడుగ పరిగణింపబడుటకు కారణం దైనికజీవనంలో ప్రతి కార్యకలాపము ఆధ్యాత్మికత్వముచే మేళవింపబడి మహత్తర ఫలితాలను సాధించడమనియు, మహాత్ముని జీవితము క్రమశిక్షణా మూర్తిత్వమగుటచే నేటి విద్యార్థులు ఖాదీజీవితమున ఆదర్శవంతులగుటకు గాంధేయ మార్గమే దోహదకరమవగలదని నక్తలు ఉద్ఘాటించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఎజ్యుకేషన్ ప్రిన్సిపాల్ శ్రీమతి జోహరాబేగం "విద్యారంగములో ఆధ్యాత్మిక విలువలు" అను గోష్ఠికి అధ్యక్షత వహించారు. పాఠశాల ఉపాధ్యాయ సంఘము విద్యార్థుల సంఘముల సంయుక్తాధ్వర్యమున యేర్పాటయినది.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. వి. రామకృష్ణారావు అతిథుల నాహ్వానించుచూ మహాత్ముని నిర్మాణ కార్యక్రమములో అత్యంత శక్తివంతమైన నయీతాలిబింశక్తిని అర్థముచేసికొన్న ఉపాధ్యాయులు స్వల్పసంఖ్యలో నున్నారనియు, ఉపాధ్యాయులలో ఆధ్యాత్మిక సంపన్నత ఆదర్శాలు లోపించిన విద్యార్థులనుండి ప్రాచీన గురువులకుగల గౌరవాన్ని పొందడం దుస్సాధ్యమని స్పష్టము చేశారు.

జాతీయ సమైక్యతా ప్రమాణాన్ని కూడా చదివారు. పాఠశాల సహాయోపాధ్యాయులు శ్రీ సయ్యద్ ఈసా. శ్రీ సుల్తాన్ అహమ్మద్, శ్రీ రామకృష్ణశాస్త్రి, విద్యార్థి ప్రతినిధి శ్రీ ఫణీందర్ గోష్ఠిలోపాల్గొన్నారు

ఉపాధ్యాయ సంఘకార్యదర్శి శ్రీ టి. సుదర్శనం కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ పారిశుధ్యవారమును పురస్కరించుకొని ఉపాధ్యాయుల నాయకత్వమున తరగతులవారిగ పారిశుధ్య కార్యక్రమము నిర్వహింపబడినది. వన్యమృగవార సందర్భము తెలుగు-ఉర్దూభాషలలో వ్యాసరచన యేర్పాటయినది.

స్టేట్ టీచర్స్ యూనియన్ కార్య నిర్వాహకవర్గం

హైద్రాబాద్, అక్టో 11

అక్టోబరు 13వ ఉదయము 11గంటలకు హిమాయత్‌నగర్ కార్యాలయములో రాష్ట్రోపాధ్యాయ సంఘ కార్యనిర్వాహకవర్గ తృతీయ సమావేశము జరుగును.

హత్యసందర్భంగా తొమ్మిదిమంది అరెస్టు

తాడేపల్లిగూడెం, అక్టో 11

తణుకుసమీపంలోని మండపాకలో పోలీసులు పెండ్యేలసత్యం, మరో ఎనమిదిమందిని అరెస్టుచేశారు.

ఖమ్మంజిల్లాకు చెందిన నందిగామ పాడు యొక్క వేగి నాగరత్నం హత్యసందర్భంగా ఈఅరెస్టులు జరిగాయని తెలుస్తున్నది.

ఈ సందర్భంగా కొన్నాళ్ళక్రితం రాజమండ్రిలోని ముత్తంగి నరసయ్య అను అడ్వొకేటు అరెస్టుచేయబడినాడు గూడా.

ఇల్లెందు చేనేత పారిశ్రామిక సహకార సంఘం

ఇల్లెందు, అక్టో 11

శ్రీ కె. లింగబ్రహ్మం స్పెషల్ ఆఫీసరు అధ్యక్షతన ఇటీవల ఇల్లందు చేనేత పారిశ్రామిక సహకార సంఘ 14 వ వార్షిక సాధారణ మహాసభ సంఘ స్వంతభవనములో 11గంటలకు జరుపబడినది. దాదాపు రెండు వందలమందిసభ్యులుసభలో పాల్గొనిరి. సభ్యులుగాక కొందరు ప్రత్యేకఆహ్వానులుగూడ సభలో పాల్గొనిరి.

చర్చనీయాంశముల ననుసరించి శ్రీ స్పెషల్ ఆఫీసరు వారి రిపోర్టును సంఘపరిస్థితి తెలుపుకు చదివి వినిపించిరి. మరియు ఆడిట్ కాని లెక్కలు 1962-63 సం॥నకు సంబంధించిన రాబడులవ్యయముల పట్టికలను మరియు జూన్ 1963 అంతము వరకుచూపబడిన ఆస్తులఅప్పులపట్టికను చదివి వినిపించిరి. 1963-64 సం॥ అంచనా ఆదాయ వ్యయములపట్టికను మరియు ఆస్తులపై వ్యయముల పట్టికను సభలో ప్రవేశపెట్టగా దానిని ఏకగ్రీవముగా తీర్మానించి ఆమోదించబడినది.

శ్రీ స్పెషల్ ఆఫీసరు తమ ఉపన్యాసములో మాట్లాడుతు దానికి కావలసిన అంశములను మరియు అభివృద్ధిదేయు మార్గములను క్లుప్తముగా చెప్పిరి. అనంతరం సభ ముగిసినది.

షాబాద్ గ్రామంలో గాంధీ జయంతి

షాబాద్, అక్టో 11

షాబాద్ గ్రామమున "గాంధీ జయంతి" అతివైభవముగా జరిగినది. కార్యక్రమమునకు షాబాద్ పురపాలక సంఘ అధ్యక్షులు అయిన కె. శంకరయ్యగారి ఆధ్వర్యమున, పురపాలక సంఘమెంబర్లు, పట్టణవాసులు, హైస్కూలు హెడ్ మాష్టరు,మాష్టర్లు స్కూల్ బాల బాలికలు, గవర్నమెంటు ఆసుపత్రి డాక్టరుగారు అందు కలసి సుమారు 300 మంది ఉదయము ప్రార్థతో ప్రభాతఫేరీ ఆరంభింపబడినది. తర్వాత హరిజనవాడలో ప్రత్యేశింపబడి పారిశుద్ధ్యత కార్యక్రమము మరియు సుమారు 4 ఫర్లాంగులు రోడ్డు - శ్రమదానముగా మట్టిత్రవ్వివేయనైనది.

వ్యవసాయ విశ్వవిద్యాలయ బిల్లు పరిశీలన

హైద్రాబాద్, అక్టో 11

ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంఘం అక్టోబరు 7వ తేదీనాడు అసెంబ్లీహాలులో శ్రీ టి. హయగ్రీవాచారి అధ్యక్షతన సమావేశమైనది. 1963 ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ బిల్లును ఈ కమిటీ విద్యా ఉపసంఘం పరిశీలన నివేదించినది. ఆ ఉపసంఘం ప్రాంతీయ సంఘానికి నివేదిక పంపవలసి వుంటుంది.

ఆంధ్రప్రాంతంపద్ధతిలో ప్రభుత్వం, జిల్లా పరిషత్తు పాఠశాలలలో ఉపాధ్యాయుల నియామకం, తెలంగాణా ప్రాంతంలో ఉపాధ్యాయుల శిక్షణపై విద్యా ఉపసంఘం సమర్పించిన ఎనమిదవ నివేదికను ఈ కమిటీ తిరిగి ఆ ఉపసంఘం పునఃపరిశీలనకు నివేదించినది.

పెక్కు నివేదికలను పరిశీలించి, ఏకగ్రీవంగా ఆమోదించబడినది.

కతకత్తాలో సైకిలింగ్ సమాఖ్య సమావేశం

టోకియో ఒలంపిక్‌లో పాల్గొనే వారి ఎన్నిక

హైద్రాబాద్, అక్టోబరు 11

ఆంధ్రప్రదేశ్ సైకిలింగ్ సంఘం కార్యదర్శి శ్రీ కె. రామస్వామి, నేషనల్ సైకిలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు, కలకత్తాలో జరిగే కార్యవర్గ సమావేశానికి హాజరు కానున్నారు.

1964లో జరిగే టోకియో ఒలంపిక్ పోటీలకు సైకిలిస్టుల ఎన్నికపై ఈ కార్యవర్గం చర్చిస్తుంది. సైకిలిస్టులకు శిక్షణఇచ్చేందుకు మార్గాలను ఆలోచిస్తారు. కొలంబోలో భారత-సింహళం "మీట్"ను యేర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను పరిశీలిస్తుంది.

జంటనగరాల్లో భిక్షుకుల స్వైరవిహారం

చట్టం అమలు జరిగినప్పటినుంచీ ఒక్కరూ అరెస్టుకాని వైనం

సికిందరాబాదు, అక్టోబరు 11

గాంధీ జయంత్యుత్సవం (1963 అక్టోబరు 2) నుండి బిక్షుక వృత్తి నిర్మూలన చట్టం అమలులోనికి వచ్చినప్పటికీ సికిందరాబాద్, హైద్రాబాద్ బిక్షుక గృహాలు ప్రారంభింపబడినప్పటికీ, గతంలో మాదిరిగానే వందల సంఖ్యలో బిక్షుకులు జంటనగరాల వీధులలో విచ్చలవిడిగా తిరుగుతూనే ఉన్నారు.

బిక్షుకవృత్తి నిర్మూలన చట్టంలోని నిబంధనలను అమలుపరచాలనీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పోలీసు అధికారులకు తెలిపారు.

ఈ చట్టంలో నిబంధనల ప్రకారం పోలీసులు మొదట బిక్షుకులను హెచ్చరించి, వదలిపెట్టాలి. వారు మళ్ళీ అదే పొరపాటు చేస్తే పక్షంలో చార్జిషీటు చేసి మెజిస్ట్రేటుముందు ఉంచాలి. దానిమీదట మెజిస్ట్రేటు బిక్షుకులను హెచ్చరించవలసి ఉంటుంది. అయితే అదేపనిగా తిరిగి బిక్షమెత్తుకోవడం కొనసాగిస్తే అతను రిమాండ్ చేయబడుతాడు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ విషయం విచారించగా, హైద్రాబాదులోగానీ, సికింద్రాబాదులో గానీ ఇంతవరకు ఏ ఒక్క బిక్షుకుని కూడా మెజిస్ట్రేటు ముందు ప్రవేశపెట్టలేదనీ తెలిసినది.

దాదాపు 200 మంది బిచ్చగాళ్ళ కోసం సికిందరాబాద్‌లోని లాలాపేటలో బిక్షుక గృహం నిర్మించబడినది. ఆ గృహంలో ఒక్క బిక్షుగాడు కూడా లేడు. హైద్రాబాదులోని బిక్షుకగృహంలో ఈ చట్టం అమలులోనికి రాకముందు నుంచే 51 మంది బిక్షుగాళ్లు ఉన్నారు.

మిర్యాలగూడెం సమితిలో శ్రమదానం

మిర్యాలగూడెం, అక్టో 11

గాంధీజయంతి సందర్భమున మిర్యాలగూడెమునకు 2 మైళ్ళదూరములోనున్న "యాద్గారుపల్లి, గ్రామంలోని ప్రజలు మరియు ఇక్కడి జేసీకు ట్రెయినింగ్ ఉపాధ్యాయులు కలిసి పెద్దయెత్తున శ్రమదానము చేసిరి.

ఉదయము సామూహికపారిశుద్ధ్య కార్యక్రమము తరువాత గ్రామ మధ్యలోనున్న పెద్ద బావి బొందను పూడ్చు కార్యక్రమం మొదలుపెట్టబడెను.

గ్రామీణ స్వచ్ఛంద సేవాదళ సభ్యులు, యువకమండలి సభ్యులు గ్రామపెద్దలు, ఆబాల గోపాలమూ ఇందు ఉత్సాహముతో పాల్గొనిరి. 100 బండ్లమట్టిని ఇందులోనికి తోలబడెను. దాదాపు రూ. 300లు విలువ గలపని ఈ 4 గంటలలో జరిగినది.

8 వేలమంది కార్మికులకు నిరుద్యోగం

8 ఐ ఎల్.టి.డి. డిపోల మూసివేత

హైద్రాబాద్, అక్టో 11

ఐ.ఎల్.టి.డి మేనేజిమెంట్ 8 డిపోల మూసివేయడంవల్ల 8 వేలమంది కార్మికులకు నిరుద్యోగం ఏర్పడినది. ఈ కార్మికులకేకాక 7 వందల మంది క్లరికల్ స్టాఫ్‌కుగూడా నిరుద్యోగము ఏర్పడే ప్రమాదం ఉన్నది.

ఐ.ఎల్.టి.డిమేనేజిమెంటుచర్యను ఆంధ్రప్రదేశ్ హైవేస్ ఎంప్లాయీస్ యూనియన్ ఖండించింది. ప్రభుత్వాన్ని ఈ వ్యవహారంలో జోక్యంకల్గించుకొని పెద్దపెట్టున జరిగిన ఈ నిరుద్యోగాన్ని నివారించమనికోరింది.

మాస్కో, కరాచి విమానసర్వీస్

కరాచి, అక్టోబరు 11

మాస్కో- కరాచీల మధ్య సోవియట్ ఎయిర్ లైన్స్ విమాన సర్వీసు నవంబరు రెండవవారంలో ప్రారంభమవుతుంది.

ఆఖరి వారం
29 వ వారం
బసంత్
ప్రతిరోజు 2-00, 6-00, 9-45
లలితా శివజ్యోతి ఫిల్మ్స్ వారి:
లవకుశ
29వవారం: రాజరాజేశ్వరి-వరంగల్
2వ వారం: నాగేశ్వర్-కొత్తగూడెం
నేటినుండి: భారతి-కరీంనగర్
—చక్రియా విడుదల.

నేటి రాత్రి
గురుదత్ ఫిల్మ్స్ (ప్రయివేట్) లిమిటెడ్
సి. ఐ. డి.
(కొత్త ప్రింటు)
తా: దేవానంద్, వహీదారెహమాన్, షకీల, జానీవాకర్.
దర్శకత్వం:
రాజ్ ఖోస్లా.
మనోహర్
సికింద్రాబాద్.
ఆటలు: 3-30, 6-30, 9-30.

4 వ సంయుక్త వారం!
యుద్ధానికి సిద్ధంకాదు అయితే మన స్వాతంత్ర్యంపై ఛాలెంజీ చేస్తే సహించం.
ఈ సత్యాన్ని చాటే కాబూలిఖాన్ చిత్రం
కె. అమర్‌నాథ్స్:
కాబూలి ఖాన్ (ఈస్ట్‌మన్ కలర్)
నిర్మాత, దర్శకుడు: కె. అమర్‌నాథ్. సంగీతం: చిత్రగుప్త. పాటలు: మజ్రూ.
తా: అజీత్, హెలెన్, జయంత్, శామ్‌సన్, ఉల్లాస్, ముక్రి.
ప్యాలెస్ హైద్రాబాద్ అలంకార్ సికింద్రాబాదు
ఆటలు: 3-30, 6-30, 9-30.

—శ్రీ బాలాజీ పిక్చర్సు విడుదల.

4 వ సంయుక్త వారం!
భక్తి, ప్రేమ, సానుభూతి, వినోదమూ అన్నీ అందిస్తూ గడిచిన తరంలో తెలుగునాట జరిగిన కుటుంబగాథను రూపించిన చిత్రం.
గోకుల్ ప్రొడక్షన్స్:
శ్రీ తిరుపతమ్మకథ
నిర్మాణం: డి. కృష్ణమూర్తి. దర్శకత్వం: బి. ఎస్. నారాయణ.
సంగీతం: పామర్తి మరియు బి. శంకర్‌రావు (హైదాబాద్)

తా: ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి, గుమ్మడి, రాజసులోచన, హేమలత, సూర్యకాంతం, రమణారెడ్డి, చదలవాడ, సత్యనారాయణ.
కమల్ హైద్రాబాద్ రాజేశ్వర్ సికింద్రాబాద్
నేడు 3 ఆటలు: 2-30, 6-00, 9-30.
2వ వారం! శ్రీ రామ - వరంగల్.
—పూర్ణా పిక్చర్స్ విడుదల.

నేటి రాత్రి
ప్రసాద్ ఆర్టు పిక్చర్స్:

ఇల్లరికం

డా॥ నాగేశ్వరరావు, జమున, గుమ్మడి, రేలంగి.

అంజలి
సికింద్రాబాద్
ఆటలు: 2-30, 6-00, 9-30
—నవయుగ

4 వ వారము
సహనానికి కన్నీరు, ప్రణయానికి విరహమే సంఘంద్వారా లభించే ప్రతిఫలం
సదాశివ్ చిత్రాస్:

బేగానా

నిర్మాత, దర్శకుడు:
సదాశివ్ జె. రావు కవి
సంగీతం:
సవన్‌జగ్‌మోహన్
★ ధర్మేంద్ర, సుప్రియ, బాబులు, సైలేష్‌కుమార్, అగ.

రాయల్ - హైదరాబాద్
నేడు 3 ఆటలు: 3-30, 6-30, 9-30.
—శ్రీ బాలాజీ పిక్చర్స్ విడుదల.

మంథనిలో పైరులకు తీవ్ర నష్టం

మంథెన, అక్టోబరు 11

ఈ సంవత్సరం దాదాపు రెండు నెలల నుండి ఈ తాలూకాలో వానలు కురియక, మాగాణిపైరులన్నీ చాలా వరకు చెడిపోయాయి.

ఈ తాలూకాలో దాదాపు 28వేల ఎకరాలలో వరిపైరు పండుతుంది. అందులో చాలా భాగం ఆస్మానీతరీ, మిగిలిన మాగాణి భూములు, చిన్న చిన్న కుంటలు మున్నగువానివల్లసాగుచేయబడతాయి.

ఇంత దీర్ఘకాలం వర్షాలు లేనందువల్ల చిన్న చిన్న కుంటలు ఎండి, వాని క్రింది పారకపు నేల, ఆస్మానీతరీ ఉన్న పైరుల నేల బీటలువారి, పైర్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఇంతేగాక మొత్తంపై వరిపైరుకు దుంప రోగం, గొట్టపు రోగం, తెల్ల బొమ్మిడి మున్నగు రోగాలు తగిలి, పంటలు చాలావరకు దెబ్బతిన్నవి.

ఈవరకే పునాసపైరులు చెడిపోయి యున్నవి. వానలు లేక రబీ పోతలు కూడా సాగుటకు వీలు పడలేదు. ఈ పరిస్థితుల మూలాన ఆహార ధాన్యాల ధరలు దినదినం పెరుగుటవల్ల, తాలూకా ప్రజలు చాలా భయాందోళనలకు గురియవుతున్నారు.

16 వ సంయుక్త వారం!



ప్రతిరోజు 3 ఆటలు: 2-45, 6-00, 9-30.

6 వ సంయుక్త వారం
ప్రారంభం తప్పక చూడండి అయితే ముగింపును గుప్తపరచండి

రవీంద్ర ఆర్ట్ ప్రొడక్షన్స్

లక్షాధికారి

సాగర్ హైదరాబాద్
ప్యారడైజ్ సికింద్రాబాద్
ఆటలు: 2-30, 6-00, 9-30
—వాణి విడుదల

సహకారంపై ఏటా సత్కృత్వపోటీలు

న్యూఢిల్లీ, అక్టో 11

భారత జాతీయ సహకార సమాఖ్య 1968-64వ విద్యాసంవత్సరానికి సహకారంపై అఖిలభారత వక్తృత్వపోటీ ఒకటిఏర్పాటుచేస్తున్నది. కేంద్ర సమాజాభివృద్ధి, సహకారవ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రోద్బలంతో ఏర్పాటైన ఈపోటీ విడివిడిగా రెండు స్థాయిలలో నిర్వహించబడుతుంది.

మొదట విశ్వవిద్యాలయస్థాయిలో జరిగే పోటీకి అన్ని అనుబంధ కళాశాలలు ఇద్దరేసి చొప్పున వక్తలను పంపుకోవచ్చును. ఈ పోటీలో గెలుపొందిన జట్టుకు విశ్వవిద్యాలయ ప్రశంసా పత్రాలు బహూకరిస్తారు. ఇవికాక వ్యక్తిగత ప్రావీణ్య ప్రదర్శనకు గాను రు.75 రు.50, రు.30 విలువచేసే మరో మూడు బహుమానాలు కూడా ఉంటాయి. వీటి విలువలో సగం పుస్తకాల రూపేణా మిగతా సగం నగదు రూపేణా ఇవ్వడం జరుగుతుంది.

జాతీయ స్థాయిలో జరిగే పోటీకి వివిధ విశ్వవిద్యాలయాలు తమ తమ విశ్వవిద్యాలయాలలో గెలుపొందిన జట్లను పంపుకోవలసి వుంటుంది. ఇందులో గెలిచిన విశ్వవిద్యాలయ జట్టుకు సహకారశిక్షణ సమితి జాతీయ ప్రశంసా పత్రం బహూకరిస్తుంది. ఇది కాక వ్యక్తిగత ప్రావీణ్య ప్రదర్శనకు గాను రూ.250, రూ.200, రూ.150 విలువచేసే మరో మూడు బహుమానాలు కూడా ఇస్తారు. వీటి విలువలో సగం పుస్తకాల రూపంలో ఇస్తారు.

భారత జాతీయ సహకార సమాఖ్య తాలూకు సహకార శిక్షణ సమితి ఈ వివిధ బహుమతులకు అయ్యే ఖర్చు భరిస్తుంది. విశ్వవిద్యాలయ ప్రశంసా పత్రాలు అందచేయడమేకాక ఈ పోటీలలో పాల్గొనే వక్తల ప్రయాణపు ఖర్చులు కూడా భరిస్తుంది.

1968 డిసెంబరు 15వ తేదీలోగా ఈ పోటీలను నిర్వహించ వలసిందిగా విశ్వవిద్యాలయాలను కోరడమైంది. జాతీయ స్థాయి పోటీ 1964 జనవరి-ఫిబ్రవరి మాసాల మధ్య జరుగుతుంది.

చెరుకు పంటకు క్రొత్తరకం తెగుళ్ళు

న్యూఢిల్లీ, అక్టోబరు 11

దేశములో కొన్ని ప్రాంతాలలో చెరుకుపంటకు క్రొత్తరకము తెగుళ్ళు వచ్చాయి. పేడపురుగు జాతికి చెందిన ఒకరకము క్రిములవల్ల ఈచీడపట్టింది, ఈపురుగు భూమి అడుగున చెరుకు వేళ్లకుపట్టి పంటకు నష్టము కలిగిస్తుంది. ఈతెగులు ఎక్కువగా వచ్చినప్పుడు ఆగస్టు-సెప్టెంబరు మాసాలలో చెరుకు ఎండిపోవడం మొదలవుతుంది.

1956-57వ సంవత్సరములో బీహారులోని సహారాదుజిల్లాలో చెరుకు పంటకు ఈరకము తెగులు వచ్చింది. యీ తెలుగు నివారణపై లక్నోలోని భారతీయ చెరుకు పరిశోధన సంస్థలో పరిశోధనలు జరిగాయి. ఫలితముగా చెరుకు పండించే భూములలో మే నెలలో ఒక్కొక్క హెక్టాంకరానికి 4 కిలోగ్రాముల గమ్మా బి.హెచ్.సి. అనే క్రిమిసంహారక ఔషధము వాడి ఈ తెగులు రాకుండా నివారించవచ్చునని కనుగొన్నారు.

దేశదారిద్ర్య నిర్మూలన కృషి

గాంధేయ కార్యకర్తలకు శ్రీ ఢేబర్ సలహా

పూనా, అక్టో 11

మనదేశంలో దారిద్ర్యం అధికంగా ఉన్నదని గాంధేయ కార్యకర్తలు దీని నిర్మూలనకు కృషిచేయాలని ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ చైర్మన్ యు.ఎన్. ఢేబర్ ఇక్కడ పేర్కొన్నారు.

వ్యవసాయాభివృద్ధి వల్లనే ప్రజల ఆర్థిక పరిస్థితిని బాగుపరచవచ్చును. గ్రామ పరిశ్రమల పునరుద్ధరించి పశుసంపదకు రక్షణ ఇవ్వాలి అని కోరారు వీరు. మహారాష్ట్ర గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో జరిగిన గాంధేయ కార్యకర్తల సమావేశంలో ఢేబర్ ప్రసంగించారు.

త్రిపురాకు తుఫాను తాకిడి

అగర్తలా, అక్టోబరు 11

ఈనెల 7వ తేదీన త్రిపురాకు తగిలిన తుఫానుతాకిడిలో 10 మంది మరణించారు; ఇంకొక అయిదుగురి జాడ కాన్పించడం లేదు.

కామన్వెల్తు పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశం

నవంబర్ 4 నుండి 9 వరకు కౌలాలంపూర్‌లో

న్యూఢిల్లీ, అక్టో 11

కౌలాలంపూర్‌లో నవంబర్ 4 వ తేదీ నుండి 9 వరకు జరిగే కామన్‌వెల్తు పార్లమెంటరీ అసోసియేషన్ వార్షిక సమావేశానికి లోకసభస్పీకరు హుకుంసింగ్ నాయకత్వంలో భారత ప్రతినిధివర్గం హాజరవుతుంది.

ఈ ప్రతినిధివర్గం మలేసియా సుగూడా పర్యటిస్తుంది. దీనిలో డిప్యూటి స్పీకర్ ఎస్.వి. కృష్ణమూర్తి రావు, యు.ఎన్.ఢేబరి, మిస్ శాంతా వశిష్ఠు, ఎస్.ఎల్.షక్‌ధర్ ఉంటారు. అక్టోబర్ 21 న లోకసభస్పీకర్ మలేసియాకు వెళ్లుతారు. కృష్ణమూర్తి రావు ఢిల్లీ నుండి అక్టోబర్ 21 న మలేసియాకు బయలుదేరుతారు. కౌలాలంపూర్‌కు వెళ్ళుతూ అక్టోబర్ 16నుండి 19 వరకు బ్రిటిష్ పార్లమెంటరీ ప్రతినిధివర్గం భారతదేశంలోపర్యటిస్తుంది.

నగరంలో నేడు

బషీర్‌బాగ్ ప్రభుత్వ టెయినింగ్ కళాశాలలో బి. మెడ్ విద్యార్థుల సంఘము, హిందీ పండితుల సంఘములను సాయంత్రము 5 గంటలకు రాష్ట్ర విద్యా మంత్రి శ్రీ పి. వి. జి. రాజు ప్రారంభించెదరు.

కేంద్ర ఆరోగ్యశాఖ ఉపమంత్రి డాక్టరు డి. ఎస్. రాజు

న్యూఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి నేడు హైదరాబాదు వస్తారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమము గురించి, పరిణామిక కృషి సమీక్షను గురించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరుపుతారు. కుటుంబ నియంత్రణ వ్యవహారాల శాఖ డైరెక్టరు కర్నల్ సైనా కూడా వారి వెంట వస్తున్నారు. ఇక్కడ చర్చలు ముగించుకొని డాక్టరు డి. ఎస్. రాజు రేపు ఆదివారం నాడు విమానములో బయలుదేరి బెంగుళూరు వెళతారు.

పంచాయతీ అధ్యక్షుని తొలగింపు

హైద్రాబాదు, అక్టో 11

గుంటూరు తాలూకా ఇప్పటం పంచాయతీ అధ్యక్షుడు శ్రీ మున్నంగి వెంకట నారాయణరెడ్డిని ఈ నెల 30వ తేదీ నుండి పదవి నుండి తొలగిస్తూ గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి వుత్తరవులు జారీ చేశారు.

మఖన్‌సింగ్ విడుదలకు సుప్రీంకోర్టు ఉత్తర్వు

న్యూఢిల్లీ, అక్టో 11

భారత రక్షణ నిబంధనల కింద డిటెన్షన్‌లో ఉంచబడిన మఖన్‌సింగ్ తారాసింగ్ ఎం.ఎల్.ఏ. ను విడుదల చేయుమని సుప్రీంకోర్టు ఉత్తర్వుచేసింది.

ఢిల్లీకి రాష్ట్రపతి తిరిగి రాక

న్యూఢిల్లీ, అక్టో 11

బెంగ్లూర్‌లో రెండు రోజులుండి వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న మీదట రాష్ట్రపతి డా॥ ఎస్. రాధాకృష్ణన్ ఢిల్లీకి నేటి ఉదయము తిరిగి వచ్చారు.

మద్రాసు రాష్ట్రములో ప్రతి పంట

మద్రాసు, అక్టో, 11

1962-63సంవత్సరములో మద్రాసు రాష్ట్రమందు ప్రతిపంట 1004500 ఎకరాలలో పండించబడినది. 402 వేల బేళ్ల ప్రతి పండగలదని అంచనా వేయబడినది.

నాసర్, సిరిమావో సంప్రదింపులు

కైరో, అక్టో 11

ఐక్యఅరబ్ రిపబ్లిక్ అధ్యక్షులు నాసర్, సిలోన్ ప్రధాని శ్రీమతి బండారునాయకే మధ్య నిన్నటి నుండి సంప్రదింపులు ప్రారంభింప బడనవి.

వొకేషనల్ గైడన్సు సెమినార్

హైద్రాబాదు, అక్టో 11

ఉస్మానియా గ్రాజ్యుయేట్స్ సంఘ ఆధ్వర్యమున ఎగ్జిబిషన్ క్లబ్‌నందలి గైడన్సు సెంటర్‌లో వొకేషనల్ గైడన్స్ సెమినార్ అక్టోబరు 12 న యేర్పాటు చేయబడింది.

డాక్టర్ పరమేశ్వరన్, డాక్టర్ జి. బి. జెల్, శ్రీ యన్. వై. రెడ్డి, శ్రీ విరాఘవరావు, డాక్టర్ యన్. వి. తీర్థ మొదలగు విద్యావేత్తలు, నగరంలోని వివిధ పాఠశాలల కళాశాలల డెలిగేట్లు యిందు పాల్గొందురు.

స్టౌ అంటుకొని స్త్రీ దుర్మరణం

(గోలకొండ పత్రిక విలేఖరి)

నిజామాబాద్, అక్టో 11

ఈనెల 7 వ తేదీన ఆర్మూరులో పంచాయతీసమితి గ్రామసేవిక కుమారి యం. లలిత ప్రభుదాస్ ఇంటిలో రాత్రి వంటలు వండుకొనుటకు స్టౌను అంటుపెట్టుచుండగా ప్రమాదవశాత్తున భగ్గున మంటరేగి బట్టలకు అంటుకొని శరీరం పూర్తిగా కాలిపోయినది.

ఇంటిచుట్టుపట్ల ఉన్నవాళ్ళు కేకలు విని ఇంటికిరాగా ఘోరమైన దృశ్యము కనబడినది.

వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకవెళ్ళినారు. కుమారి లలిత తల్లిదండ్రులు కామారెడ్డిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉన్నారు.

ఇట్టివార్త అందిన వెంటనే ఆర్మూరుకువచ్చినారు. కుమారి లలిత మరుసటిరోజు మధ్యాహ్నము అసువులు కోల్పోయినది. ఈ శవమును కామారెడ్డికి తీసుకవెళ్ళి అంతిమ క్రియలు చేశారు.

సహకార పద్ధతి పంచదార ఫ్యాక్టరీలు

కోయంబత్తూరులో నాల్గవ అఖిలభారత గోష్ఠి

న్యూఢిల్లీ, అక్టోబరు 11

సహకార పద్ధతి పంచదార ఫ్యాక్టరీలకు సంబంధించిన నాల్గవ అఖిలభారత గోష్ఠి ఈనెల 20 నుంచి 22 వరకు కోయంబత్తూరులో జరుగుతుంది. ఈ గోష్ఠికి మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ ఎం. భక్తవత్సలం ప్రారంభోత్సవం జరుపుతారు. కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి డాక్టర్ రామ్ సుభాగ్‌సింగ్, కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఉపమంత్రి శ్రీ ఎస్. డి. మిశ్రా, కేంద్ర ఆహార శాఖ ఉపమంత్రి శ్రీ ఎ. ఎం. థామస్ ఈ గోష్ఠిలో పాల్గొంటారు. ఇంతేగాక సహకార విభాగంలో పంచదార పరిశ్రమ తాలూకు ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలలో ఇందుకు సంబంధించిన అధికారులు దీనిలో పాల్గొంటారు.

పంచదార పరిశ్రమకు సంబంధించిన అన్ని విషయాలను ఈగోష్ఠిలో కూలంకషముగా చర్చిస్తారు. చెరుకుకి రకాన్ని బట్టి ధర చెల్లించే పద్ధతాన్ని అమలు పరచటం, చెరుకును పండించే వారి శ్రేయస్సు కాపాడడానికి సహకార విభాగములోని పంచదార పరిశ్రమకు చెందిన ప్రతినిధులను అన్నిస్థాయిలలోనూ ప్రభుత్వ సంస్థలలో నియమించటము, 1963-64లలో 33 లక్షల మెట్రిక్ టన్నుల పంచదారను ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ ఇటీవల 1963-64 సంవత్సరానికి ప్రకటించిన చెరుకు ధర విధానములోని సూత్రాలను సమీక్షించడము. ఆ విధానము, ఆ లక్ష్య సాధనకు ఎంతవరకు సరిపోయేదీ పరిశీలించడము ఈ విషయాలను గురించికూడా ఈగోష్ఠిలో చర్చిస్తారు.

పంచదార ఎగుమతి పథకాన్ని అమలు పరచటములో పంచదారసహకార సంఘాలు పాల్గొనటానికి తీసుకోవలసిన చర్యలను గురించి ఎగుమతి చేయటానికి కుదిర్చి చేయని పంచదారను ఉత్పత్తిచేసే విషయములో రాష్ట్ర స్థాయిలోనూ అఖిల భారత స్థాయిలోనూ సహకార పద్ధతి పంచదార ఫ్యాక్టరీలు ఒకదానితో ఒకటి సహకరించటానికి తీసుకోవలసిన చర్యలను గురించికూడా ఈగోష్ఠిలో చర్చిస్తారు. సహకార పద్ధతి పంచదార ఫ్యాక్టరీల వాటా ధనాన్ని ఎక్కువ చేయటానికి యింకా తీసుకోవలసి వున్న చర్యలను గురించి దీనిలో చర్చిస్తారు.

పంచదార సహకార సంఘాలకు ఆర్థిక సహాయాన్నిఅందిస్తున్న రాష్ట్ర సహకార బ్యాంకులు తమ వడ్డీరేటును స్టేటుబ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకునేదానికి సమానముగా వుండేట్లుగా తగ్గించాలన్న విషయంగూడా దీనిలో చర్చిస్తారు.

చెరుకు అభివృద్ధి, పంచదార సహకార సంఘాలకు అధికంగా చెరుకును సప్లయి చేయటం మొదలయిన విషయాలుగూడా ఈగోష్ఠిలో చర్చిస్తారు.

ప్రస్తుతం దేశంలో 57 సహకార పంచదార ఫ్యాక్టరీలకు లైసెన్సులు యిచ్చారు. వీటిలో 41 ఫ్యాక్టరీలలో క్రిందటి చెరుకు పంటకాలంలో ఉత్పత్తి జరుగుచున్నది. సహకార విభాగంలోని ఫ్యాక్టరీలలో ఉత్పత్తి క్రిందటేడు 17.4 శాతం నుంచి 21.6 శాతానికి పెరిగింది.

కలకత్తాలో సోషలిస్టు పార్టీ మహాసభలు

వారణాసి, అక్టో 10

డిసెంబర్ 28 నుండి నాల్గు రోజుల పాటు కలకత్తాలో సోషలిస్టు పార్టీ మహాసభ జరుగుతుంది.

రాకపోకలు

ముఖ్యమంత్రి డా॥ ఎస్.నంజీవరెడ్డి అక్టోబరు 15వ తేదీన ఉదయము 7గంటలకు కారులో అనంతపురం వెళ్తారు. ఆ సాయంకాలం జిల్లాపరిషత్తు కార్యాలయ భవనానికి, జిల్లా స్టేడియానికి శంకుస్థాపనలు చేస్తారు. అక్టోబరు 16వ తేదీన తాడిపత్రి వెళ్ళి ఉదయం పంచాయతీ సమితికి, అమధ్యాహ్నము పెనికిచెర్ల వద్ద మధ్య పెన్నారు ప్రాజెక్టుకు ప్రారంభోత్సవాలు చేస్తారు. సేవామందిరం, వసతి అగ్రహారము సందర్శించిన అనంతరము 18వ తేదీన రోళ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రారంభోత్సవముచేసి పౌరసభలో ప్రసంగించి, ఆరాత్రికే తిరిగి అనంతపురం చేరుకుంటారు. అక్టోబరు 20వ తేదీన అనంతపురంనుండి చిత్తూరు వెళ్తారు. అక్కడ జిల్లాపరిషత్తు కొత్త సమావేశ మందిరానికి ప్రారంభోత్సవము చేస్తారు. అక్టోబరు 21వ తేదీన హార్సీకొండలవద్ద గుజరాతు గవర్నరు పాఠశాల భవనాలకు శంకుస్థాపనచేసే కార్యక్రమానికి వీరు అధ్యక్షత వహిస్తారు. తిరిగి వీరు 22వ తేదీన రాజధానికి చేరుకుంటారు.

దేవాదాయ మంత్రిణి శ్రీమతి సదాలక్ష్మి అక్టోబరు 14 వ తేదీన సామర్లకోట వెళ్తారు. మర్నాడు కాకినాడలో బాలికల పాలిటెక్నిక్కు కళాశాల విద్యార్థినుల సంఘానికి ప్రారంభోత్సవముచేసి, కాకినాడలోని దేవాలయాలను సందర్శిస్తారు. తిరిగి అక్టోబరు 17వ తేదీన హైద్రాబాదు చేరుకుంటారు.

నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి నాగార్జున సాగర్‌కు అక్టోబరు 15వ తేదీన వెళ్ళుతున్నట్టు లోగడ ప్రకటించిన పర్యటన రద్దయింది. అక్టోబరు 15వ తేదీన కారులో వీరు అనంతపురము వెళ్ళుతారు. అమర్నాడు పెనికిచర్లను సందర్శిస్తారు. ఆదోనిలో లో-లెవెల్ కాలువను సందర్శించి 17వ తేదీన తిరిగి హైద్రాబాదు చేరుకుంటారు.

ప్రణాళిక, పంచాయతీరాజ్ శాఖల మంత్రి డా॥ ఎం. చెన్నారెడ్డి అక్టోబరు 13వతేదీన హైదరాబాదుజిల్లాలో చేవెల్ల, కనకమామిడి గ్రామాలలో లోగడ ప్రకటించినపర్యటనరద్దయింది.

పరిశ్రమల మంత్రిచే కొత్తగూడెం బొగ్గు గనుల సందర్శన

కొత్తగూడెం, అక్టో 11

రాష్ట్ర పరిశ్రమల మంత్రి డా॥ఎం. ఎన్. లక్ష్మీనరసయ్య నిన్న యిక్కడికి వచ్చిన సందర్భంగా బొగ్గు గనుల్ని సందర్శించారు. ఇక్కడి నుండి 23 మైళ్ళ దూరానగల మైలవరం గ్రామానికి ఆయన వెళ్లారు.

అక్కడ భారత ప్రభుత్వ భూగర్భశాస్త్ర శాఖ ఆధ్వర్యాన రాగిగనుల తవ్వకం పనులు సాగుతున్నాయి. ఆ తవ్వకం కార్యక్రమాన్ని కూడ మంత్రి సందర్శిస్తారు.

సుబ్రోతో ముఖర్జీ కప్ టోర్నమెంటు

న్యూఢిల్లీ, అక్టోబరు 11

ఈ సంవత్సరపు సుబ్రోతో ముఖర్జీ కప్ టోర్నమెంటులో 20 పాఠశాలకు చెందిన క్రీడాకారుల జట్లు పాల్గొంటాయి. ఈ ఆటల పోటీలు నవంబరు 1వతేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఈ టోర్నమెంటు మొట్ట మొదటిసారి 1961లో అఖిల భారత ప్రాతిపదికపై నిర్వహించ బడింది. అందులో కలకత్తాలోని రాణిరాష్మాని ఉన్నతపాఠశాల జట్టు డెహరాడూన్‌లోని ప్రభుత్వ సైనిక ఉన్నత పాఠశాల జట్టుపై సుబ్రోతో ముఖర్జీ కప్పు గెల్చుకొంది.

అత్యవసర పరిస్థితి మూలముగా గత సంవత్సరం ఈ టోర్నమెంటు జరగలేదు.

చిత్రకారుడు శ్రీవరదా వెంకటరత్నం మృతి

రాజమండ్రి అక్టో 11

ప్రఖ్యాతాంధ్ర చిత్రకారుడు, దామెర్ల రామారావు ఆర్టుగ్యాలరీ, చిత్రలేఖన పాఠశాలల స్థాపకుల్లో ఒకరూఅయిన శ్రీ వరదా వెంకటరత్నం నేటిఉదయం ఇక్కడ చనిపోయారు. ఆయన వయస్సు 68 సంవత్సరాలు. ఒక ఏడాదినుండి ఆయన అనారోగ్యంగా ఉన్నారు

శ్రీ వెంకటరత్నం వ్రాసిన చిత్రకళా ఖండాలు అనేకం ఇంగ్లండులోని వెబ్లి మ్యూజియం, కెనడాలోని టొరాన్‌టో మ్యూజియం, మయిసూరు, హైద్రాబాదు సాలార్‌జంగు మ్యూజియంలలో ప్రదర్శించ బడుతున్నాయి.

యు. పి. మంత్రివర్గం ఏర్పాటు పట్ల సంతృప్తి

సోమవారం నాడు నూతన మంత్రుల ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ, అక్టోబరు 11

ఉత్తరప్రదేశ్‌లో 21 మంది మంత్రులుగల ప్రభుత్వం ఏర్పడేందుకు కేంద్ర పార్లమెంటరీ బోర్డు తీసుకున్న నిర్ణయంపట్ల యు. పి. కాంగ్రెసులోని ఇరువర్గాల వారూ సమ్మతిని వెల్లడించారు.

ఈ నిర్ణయం ప్రకారం ఉండగల 16 గురు మంత్రుల్లో 5 గురు. 5గురు ఉపమంత్రుల్లో ఇద్దరు భిన్నవర్గం వారికి సంబంధించిన టారనితెలుస్తున్నది

నూతన మంత్రులు అక్టోబరు 14న ప్రమాణ స్వీకారం చేయగలరు.

ఈ ఏర్పాటుకు యు. పి. కాంగ్రెసు వర్గాలవారు సమ్మతించినందుకు కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ సంజీవయ్య హర్షిస్తూ ఈరాత్రి ఒక ప్రకటన చేశారు.

డా॥ రాధాకృష్ణ ఢిల్లీ చేరిక

న్యూఢిల్లీ, అక్టో 11

రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణ రెండు దినాలు తెగుళూరులో గడిపి నేడు తిరిగి ఢిల్లీ చేరుకున్నారు.

భారత ప్రభుత్వం
ఆహార, వ్యవసాయ మంత్రాంగం
2 (2) 63- CONTR-C

తాడేపల్లిగూడెం, సెంట్రల్ స్టోరేజి డిపోలో 1-12-63 నుండి రెండు సంవత్సరములకొఱకు ఆహార ధాన్యములు, పిండి, చక్కెర, ఎరువులు ఇతర వాణిజ్య సరుకులు, హార/ట్వయిన్ బేల్స్, నిర్వహణ, రవాణాల కొఱకు లేబర్ మరియు రవాణా కంట్రాక్టర్ల నియామకమునకు భారతాధ్యక్షుని తరపున సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు రీజనల్ డైరెక్టర్ (ఆహార) సదరన్ రీజన్, 123, మౌంట్‌రోడ్, మద్రాసు-6 కు 29-10-63 సా॥ 4-0 గం॥ వరకు పంపవలెను. నిర్ణీత టెండర్ ఫారములు (మార్చుటకు వీలు లేని వి) నగదు రు. 10/- (వాపసు యివ్వబడవు) చెల్లించి రసీదుపొంది పై వారి కార్యాలయము నుండి పొంది అట్టి రసీదును టెండరువెంట జతపరుచవలెను. లేని యెడల టెండర్ పరిశీలింపబడదు.

DA-XIX (812)/63.

టెండర్ నోటీసు

జిల్లా పరిషత్ వరంగల్

జిల్లా పరిషత్ ఆఫీసు భవనమునకు విద్యుత్ ఏర్పాట్లు

నిర్ణీత షెడ్యూళ్లు 14-10-63 నుండి ఆఫీసు వేళలలో యీకార్యాలయమునుండి పొంది సీల్డు టెండర్లు పంపవలెను. టెండర్లు 31-10-1963 సా॥ 3-0 గంటలలోపున దిగువ వారికి అందజేయవలెను. అట్టి వానిని హాజరయిన టెండరుదార్ల సమక్షంలో అదేరోజు సా॥ 3-30 గం. తెరువబడును.

క్రమ సంఖ్య	పని పేరు	కంట్రాక్టు నమూనా	కోరబడిన డిపాజిట్ రూపం	తరువాత సెక్యూరిటీ డిపాజిట్	కంట్రాక్టు గడువు
1	2	3	4	5	6
1.	హన్మకొండ జిల్లా పరిషత్ కార్యాలయ భవనమునకు విద్యుత్ ఏర్పాట్లు.	K-2	రు. 900/-	రు. 900/-	3 నెలలు

టెండర్ షెడ్యూళ్ళు సేల్స్‌టాక్స్‌తోసహా వాపసు చేయనట్టి పైకం రు. 10-20 న. పై. పది రూపాయల ఇరువది నయాపైసలు) చెల్లించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జిల్లా పరిషత్ వరంగల్, పోస్టు హన్మకొండనుండి పొందవచ్చును.

ఏ కారణము చూపక ఏ టెండరయిన అంగీకరించుట లేక నిరాకరించుటకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా పరిషత్ వరంగల్‌కు హక్కుగలదు.

టెండర్ డాక్యుమెంట్ల ఖరీదు మరియు కోరబడిన డిపాజిట్ పైకం జిల్లా పరిషత్ ఫండ్స్ S-II డిపాజిట్లు మరియు అడ్వాన్సులు (వడ్డీ లేనట్టి డిపాజిట్లు) (3) ఇతర డిపాజిట్ పైకం - లోకల్ ఫండ్స్ డిపాజిట్-ఎ-డిస్ట్రిక్ట్ ఫండ్ (i (బి) జిల్లా పరిషత్ ఫండ్స్ పద్దుకు" చెల్లించవలెను.

(సం) వి. వి. ఆర్. శంకర్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
జిల్లా పరిషత్ వరంగల్

ప్రకటన

సి. ఆర్. నెం. 8816/ ఇ. ఎక్స్/ 61.1 (1) తి. 1-10-63

నల్గొండజిల్లా మునగాల పరగణా ప్రాంతంలోని తీపి కల్లు దుకాణాల అమ్మకం హక్కు- 1-12-63 నుంచి 30-9-64 వరకు గల కాలానికి నల్గొండజిల్లా కలెక్టరు లేక అతనిచే నియమితుడైన వ్యక్తిచే 15-11-63 పగలు 11-00 గం.లకు వేలం వేయబడగలదని ప్రజానీకానికి యిందు మూలముగా తెలియజేయబడుతున్నది.

2. దుకాణాలు తెరువవలసిన స్థలాలు, వేలం పాడేవారు పాటించవలసిన షరతులు మున్నగువాటికి సంబంధించిన వివరాలు నల్గొండ జిల్లా కలెక్టర్, ఎక్సైజు సూపరింటెండెంటు, నల్గొండ, ఎక్సైజు డిప్యూటీ కమీషనరు, వరంగల్లు, కార్యాలయంలో లభించగలవు. ఈ సమాచారం కార్యాలయం పనిచేసే యేరోజునైనా పనిగంటలలో లభిస్తుంది.

రెవిన్యూబోర్డు, హైదరాబాదు. } సం. మద్యనిషేధం కమీషనర్ స్థానే

వయోసంవర్ధక శాఖలో

స్పెషలిస్టు విషయం కొఱకు ప్రకటన

రాజేంద్రనగర్, ఉస్మానియా యూనివర్సిటీ వ్యవసాయకళాశాల ఎక్స్‌టెన్షన్ బ్లాక్ ప్రోగ్రాం విస్తరించబడినది.

వేతనము- రు. 300 నుండి 500.

1. విద్యాయోగ్యతలు:

(1) వెటరినరీ సైన్సు లేక సమానమైనదానిలో డిగ్రీ.
(2) 3 సంవత్సరముల వ్యక్తి అనుభవం.
(3) తెలుగు భాషా విజ్ఞానం.

40 సం॥ వయస్సులోపు అభ్యర్థులకు ప్రాధాన్యం రిటైరయిన వ్యక్తుల విషయం పరిశీలించబడును. మరోవిధంగా మంచి విద్యాయోగ్యతలు గలిగియున్న అభ్యర్థుల విషయం గురించి, ఉద్యోగాధికారి ఉద్దేశ్యం ప్రకారం కొన్ని విద్యాయోగ్యతలు సడలింపవచ్చును.

ఉన్నత విద్యాయోగ్యతలు మరియు రిటైరయిన వ్యక్తులవిషయంలో గ్రేడులో గరిష్ఠ పరిమిత వేతనంతో ప్రారంభించుటకు పరిశీలింపబడును.

తెల్లకాగితంపైన 3 కాపీలలో దరఖాస్తులను డాక్టర్ డబ్ల్యు. ఎమ్. ఎఫ్. పికెట్, పార్టీ ఫిఫ్ కె ఎస్ యు- యు ఎస్. ఎ. ఐ. డి. డైరెక్టొరేట్ ఆఫ్ అగ్రికల్చర్, షాపూర్‌వాడి, హైద్రాబాద్-22 కు 25-10-63 లోపున పంపించవలెను.

Edited Printed and Published by N. Narotham Reddy M. A. for the Golkonda Publications Ltd at Golkonda Printing Press, Hyderabad, A. P.